సంపుటి : 18
సంచిక : 207
Vol : 18
Issue : 207

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

పీపుల్స్‌డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 15 అక్టోబర్ 2026
Warangal, Thurday 15 October 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00



www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

జంతర్‌మంతర్ నిరసనలపై ఢిల్లీ పోలీసుల ఉక్కుపాదం

- సీజేపీ నేతలకు 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీ
- సొరవ్ దాస్, అశుతోష్ రంకాల రిమాండ్
- అజింక్య షిండే రూ.5వేల వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ నిరసనలు, అరెస్టుల పర్వం తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. ప్రత్యేక సమగ్ర పరిశీలన ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (జజ్రో)కి ఢిల్లీ పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. జంతర్‌మంతర్ వద్ద పోలీసు బారికేడ్లను దాటుకుని, నిషేధాజ్ఞలను ఉల్లంఘించి అక్రమంగా ప్రవేశించారన్న

(మిగతా 2లో...)

నిబంధనలు తూచ్



- చాలన్లు, కేసులు నమోదవుతున్నా మారని వాహనదారుల తీరు...
- ట్రాఫిక్ పోలీసుల ఆందోళన...
- భారీగా పేరుకుపోతున్న పెండింగ్ చాలన్లు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత 32 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 3 కోట్ల 77 లక్షల ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రతిరోజూ వేలాది సంఖ్యలో కేసులు నమోదవుతున్నప్పటికీ వాహనదారుల ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంపై ట్రాఫిక్ పోలీసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో నమోదైన

(మిగతా 2లో...)

ప్రాణం తీసిన బిర్యానీ!



రెస్టారెంట్‌లో ఫుడ్ పాయిజన్..!

మండి బిర్యానీ తిని ఒకరు మృతి

15 మందికి తీవ్ర అస్వస్థత

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఘటన

పీపుల్స్‌డైరీ–మెదక్ : మెదక్ జిల్లా నర్సాపూర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పట్టణంలోని ఒక రెస్టారెంట్‌లో భోజనం చేసిన పలువురు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. ఈ ఘటనలో సాయి రాం అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వన్ ప్యాలెస్ హోటల్‌లో మండి బిర్యానీ తిన్నవారు అస్వస్థతకు

(మిగతా 2లో...)

ఊరికి పట్టిన చీడపీడ..!



రాజేశ్వరరావుపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నేత అక్రమాల పర్వం...

మట్టి మాఫియాతోనే ఆగలేదు..

గ్రామ అభివృద్ధి నిధులు ఐదు లక్షలు కూడా మింగేశాడా..?

భార్య పేరుతో అటవీ భూమికి అక్రమ పట్టా..

పట్టాతో బ్యాంకులను, ప్రభుత్వానికి మోసం..?

2వ పేజీలో..

రెవెన్యూదే నిర్లక్ష్యం..



హుస్నాబాద్ కొత్తచెరువులో ఫంక్షన్‌హాల్....

ఎఫ్‌టిల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణం ఉందని నిర్ధారణ

2010లో అప్పటి కార్యదర్శి సర్వే నెంబర్ 645లో అనుమతిచ్చారు

గతంలోనే చర్యల నిమిత్తం లేఖ రాశాం

ఆర్టీఐకి సమాధానం ఇచ్చిన నీటిపారుదల శాఖ



2వ పేజీలో..

తెలంగాణలో విదేశీ మద్యం ధరల పెంపు

- 352 విదేశీ బ్రాండ్లపై ప్రభావం
- పండుగ వేళ మద్యం ప్రియులకు షాక్

పీపుల్స్‌డైలీ–హైదరాబాద్ : తెలంగాణలోని మద్యం ప్రియులకు ధరల పెంపు సెగ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లలో విక్రయిస్తున్న 352 విదేశీ బ్రాండ్ల ధరలను పెంచుతూ తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సర్కులర్ జారీ చేసింది. సవరించిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. వివిధ బ్రాండ్లపై దాదాపు 6 శాతం వరకు ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే మద్యంపై

(మిగతా 2లో)



పత్రిక ముసుగులో బెల్ట్‌దందా..



మేడారంలో మద్యం మాఫియా కోరలు....

వైన్స్, బెల్ట్ దందాల వెనుక ఆంధ్రజ్యోతి రిపోర్టర్ హస్తం..?

పేపర్ పేరు చెప్పుకుంటూ అక్రమ దందాలు..

పత్రికకే మచ్చ తెస్తున్న వైనం...

2వ పేజీలో..

ఎయిరిండియా విమానానికి హైజాక్ అలర్ట్..

జైపూర్‌కు అత్యవసరంగా మళ్లింపు



10వ పేజీలో..

హైదరాబాద్‌లో ఇండియా కూటమి భారీ బహిరంగ సభ?

- ఈనెల 24న లక్షమంది జనసమీకరణ
- త్వరలో వెలువడనున్న అధికారిక ప్రకటన

10వ పేజీలో..

ఊరికి పట్టిన చీడపీడ..

- రాజేశ్వరరావుపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నేత అక్రమాల పర్వం...
- మట్టి మాఫియాతోనే ఆగలేదు..
- గ్రామ అభివృద్ధి నిధులు ఐదు లక్షలు కూడా మింగేశాడా..?
- భార్య పేరుతో అటవీ భూమికి అక్రమ పట్టా..
- పట్టాతో బ్యాంకులను, ప్రభుత్వానికి మోసం..?

పీపుల్స్‌డైరీ-వెంకటాపూర్: రాజేశ్వరరావుపల్లి మట్టి క్వారీ అక్రమాల వెనుక ఉన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడి అక్రమాలు ఒక్క మట్టి మాఫియాతోనే ఆగడం లేదని, ఆయన అక్రమాల చిట్టా చాంతాడంత ఉందని స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. మా ఊరికి సదరు నాయకుడు చీడపీడలా తయారయ్యాడని గ్రామస్తులు మండిపడుతున్నారు.

గ్రామ అభివృద్ధి కోసం ఇచ్చిన 5 లక్షలు ఏమయ్యాయి..?

గ్రామస్తుల సమాచారం ప్రకారం.. అదే మట్టి క్వారీ యజమానుల నుండి గ్రామ అభివృద్ధి కోసమని సదరు కాంగ్రెస్ నాయకుడు రూ. 5 లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఆ డబ్బును గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయకుండా, సొంతానికి వాడుకున్నాడని, ఆ ఐదు లక్షల రూపాయలను కూడా మింగేశాడని గ్రామస్తులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఆ డబ్బు ఎక్కడికి పోయింది.. లెక్క చెప్పాలని గ్రామ యువత డిమాండ్ చేస్తోంది.

భార్య పేరుతో ఫారెస్ట్ భూమికి అక్రమ పట్టా...

ఈ నాయకుడి అక్రమాల్లో మరో సంచలన ఆరోపణ.. తన భార్య పేరు మీద అటవీ భూమిని అక్రమంగా పట్టా చేయించుకోవడం. అసలు ఆ భూమి కబ్జాలో కూడా లేదని, సాగులో కూడా లేదని, అయినప్పటికీ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా పట్టా పొందాడని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

పట్టాతో బ్యాంకులను, ప్రభుత్వాన్ని మోసం..?

ఆ అక్రమ పట్టాను అడ్డుపెట్టుకుని.. కొన్ని బ్యాంకులను మభ్యపెట్టి లక్షల్లో రుణాలు తీసుకున్నాడని, అంతేకాకుండా సాగులో లేని ఆ ఫారెస్ట్ భూమిపై ప్రభుత్వం నుండి రైతుబంధు కూడా పొందుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాడని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇలా మట్టి క్వారీతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, అక్రమ పట్టాలు, బ్యాంకు లోన్లు, రైతుబంధు పేరుతో ప్రభుత్వాన్ని మోసం చేయడం వంటి అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ అధికారులు విచారణ జరపాలి...

రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి.. అతని భార్య పేరు మీద ఉన్న ఫారెస్ట్ భూమి పట్టాపై సమగ్ర విచారణ జరపాలని, అసలు ఆ భూమి సాగులో ఉందా.. లేదా.. అటవీ భూమిని ఎలా పట్టా చేశారు.. అనేది తేల్చి, ఆ అక్రమ పట్టాను వెంటనే క్యాన్సిల్ చేయాలని, అక్రమంగా పట్టా చేయించుకున్న ఆ కాంగ్రెస్ నాయకుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు..

పత్రిక ముసుగులో బెల్ట్ దందా...

- మేడారంలో మద్యం మాఫియా కోరలు....
- వైన్స్, బెల్ట్ దందాల వెనుక ఆంధ్రజ్యోతి రిపోర్టర్ హస్తం..?
- పేపర్ పేరు చెప్పుకుంటూ అక్రమ దందాలు..
- పత్రికకే మచ్చ తెస్తున్న వైనం...



పీపుల్స్‌డైరీ-మేడారం(తాడ్వాయి) : మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయానికి వచ్చే భక్తులను అడ్డుపెట్టుకుని కొందరు చేస్తున్న అక్రమ వైన్స్, బెల్ట్ షాపుల దందా ఇప్పుడు కలకలం రేపుతోంది. ఈ అక్రమ దందా వెనుక ఓ ప్రముఖ దినపత్రికకు చెందిన రిపోర్టర్ హస్తం ఉన్నట్లు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి పేపర్ పేరును అడ్డుపెట్టుకుని, అధికారులను, స్థానిక నాయకులను బెదిరిస్తూ ఈ దందా సాగిస్తున్నట్లు స్థానికులు, సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. పేపర్‌లో తన పేరు ఉందనే ధీమాతో అక్రమాలకు పాల్పడుతూ.. చివరకు ఆ పత్రికకే మచ్చ తెస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సిండికేట్‌గా ఏర్పడి దోపిడీ...

వైన్ షాపుల్లో అమ్మకుండా కొన్ని బ్రాండ్లను బెల్ట్ షాపుల్లో పెట్టి, ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్ముతూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇది ఒకటి కాదు.. సిండికేట్‌గా ఏర్పడి మేడారం పరిసర ప్రాంతాల్లో ఈ బెల్ట్ దందాను నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమ సొమ్ములో కొంత భాగం సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులకు, మిగతాది స్థానిక లీడర్లకు ముడుపులుగా వెళ్తుండటం వల్లే.. 'పీపుల్స్ డైరీ' పత్రికలో ఇన్ని కథనాలు వచ్చినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, మామూళ్ల మత్తులో జోగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

భక్తుల మొక్కును సైతం వదలని దందా....

మేడారం వచ్చే భక్తులు అమ్మవారికి బెల్లం, పానకం, మందును మొక్కుగా ఆరగింపు చేస్తారనే సెంటిమెంట్ ను కూడా ఈ దందా ముఠా సొమ్ము చేసుకుంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తుల భక్తిని అడ్డుపెట్టుకుని అధిక ధరలకు మద్యం అమ్ముతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ దందాపై మొదటి నుండి ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కన్ను పడిందని, ఇప్పుడు పూర్తిగా ఈ దందాలోకి దిగిపోయాడని సమాచారం.

ఈ నేపథ్యంలో సంబంధిత ఎక్సైజ్, శాఖ అధికారులు స్పందించి, మేడారం పరిధిలో జరుగుతున్న అక్రమ వైన్స్, బెల్ట్, దందాలపై సమగ్ర విచారణ జరపాలని, అలాగే తమ పేపర్ పేరును అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతూ పత్రికా విలువలకు భంగం కలిగిస్తున్న రిపోర్టర్‌పై ఆంధ్రజ్యోతి యాజమాన్యం కూడా విచారణ జరిపి చర్యలు తీసుకుని పత్రిక గౌరవాన్ని కాపాడాలని సామాజిక కార్యకర్తలు, భక్తులు కోరుతున్నారు.

రెవెన్యూదే నిర్లక్ష్యం?

- హుస్నాబాద్ కొత్తచెరువులో ఫంక్షన్‌హాల్....
- ఎఫ్‌టిల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మాణం ఉందని నిర్ధారణ
- 2010లో అప్పటి కార్యదర్శి సర్వే నెంబర్ 645లో అనుమతిచ్చారు
- గతంలోనే చర్యల నిమిత్తం లేఖ రాశాం
- ఆర్టీఐకి సమాధానం ఇచ్చిన నీటిపారుదల శాఖ

పీపుల్స్ డైరీ - హుస్నాబాద్ నిఘా టీం : చెరువుల పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణకు సంబంధించి నిబంధనల అమలు మరోసారి చర్చనీయాంశంగా మారింది. చెరువు పూర్తి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్ పరిధుల్లో భూముల వినియోగం, నిర్మాణాలకు అనుమతుల మంజూరు వంటి అంశాలపై ఆరీఐకి సమాధానంగా నీటిపారుదల శాఖ జారీ చేసిన లేఖలో పలు కీలక విషయాలు ప్రస్తావించబడ్డాయి. సంబంధిత భూముల సర్వే నంబర్లు, గతంలో జారీ చేసిన ఉత్తర్వులు, రెవెన్యూ శాఖ రికార్డులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిన అవసరాన్ని ఈ లేఖ స్పష్టం చేస్తోంది.

తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల శాఖకు చెందిన సంబంధిత అధికారి తాజాగా జారీ చేసిన లేఖలో గతంలో వివిధ శాఖలు జారీ చేసిన ఉత్తర్వులు, తహసీల్దార్ కార్యాలయ రికార్డులు, కలెక్టర్ కార్యాలయానికి సంబంధించిన ఉత్తర్వులను ప్రస్తావించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన జీవోతో పాటు సంబంధిత సర్వే నంబర్లు, భూముల వివరాలను కూడా లేఖలో పొందుపరిచారు.

చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి, బఫర్ జోన్‌కు సంబంధించిన అంశాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు, అధికారిక రికార్డుల పరిశీలనకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కేవలం భూమి రిజిస్ట్రేషన్ లేదా ఇతర శాఖల నుంచి అనుమతులు పొందినంత మాత్రాన నీటిపారుదల శాఖ పరిధిలోని అన్ని నిబంధనలు పూర్తయినట్లుగా భావించలేమన్నది ఈ అంశంలో కీలకంగా మారింది.

2010 జనవరి 27న హుస్నాబాద్ పంచాయితీ కార్యదర్శి , సర్వే నెంబర్ 645లో తిరుమల గార్డెన్స్‌కు కట్టడానికి అనుమతి ఇచ్చినట్టు నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రజావాణి అభ్యర్థన మేరకు ఆ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సర్వే నిమిత్తం తహసిల్దార్‌కు మండల సర్వేయర్‌ని నియమించమని లేఖను రాయడం జరిగిందన్నారు.

తదనంతరం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తహసిల్దార్, ఇరిగేషన్ సబ్ డివిజన్ నం.2లతో పాటు మండల సర్వేయర్‌ల ఆధ్వర్యంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను స్థాపించడం జరిగిందన్నారు. ఈ లొకేషన్ స్కెచ్‌ను సర్వేయర్, తహసిల్దార్‌లు సంతకం చేసి లేఖ ద్వారా పంపడం జరిగిందన్నారు. ఎఫ్‌టీఎల్ లొకేషన్ స్కెచ్ ఆధారంగా కొత్త చెరువులోని తిరుమల గార్డెన్స్, మరియు ఇతర గృహ నిర్మాణాలను చేపట్టిన వారిపైన చర్యలు తీసుకోగలరని రెవెన్యూ అధికారులకు లేఖ రాయడం జరిగిందని నీటిపారుదల శాఖ అధికారులు సమాధానం ఇచ్చారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం...!

నీటిపారుదల శాఖ అధికారుల వివరణతో ప్రస్తుతం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం బయటపడుతోంది. నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు ఉన్నాయని తెలిసినా రెవెన్యూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. మొద్దునిద్ర, నిర్లక్ష్యం దాగుందా? లేక అక్రమార్కుల వద్ద మామూళ్లు దండుకుని చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారా? అని జనం ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా పట్టణంలోని ఆ చెరువులో అక్రమ నిర్మాణంపై బలమైన ఆరోపణలు వ్యక్తమవుతున్నా రెవెన్యూ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం ఏమేరకు స్పందిస్తుందో వేచిచూడాల్సిందే.



జంతర్‌మంతర్ నిరసనలపై ఢిల్లీ పోలీసుల ఉక్కుపాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలపై సీజేపీ అగ్రనేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. ఈక్రమంలోనే వారికి 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మరొక నేత అజింక్య షిండేను రూ. 5,000 వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

అక్టోబర్ 13వ తేదీ ఉదయం సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, అజింక్య షిండేలతో పాటు మరో 11 మంది సీజేపీ సభ్యులు జంతర్‌మంతర్ పరిసరాల్లోకి ఒక ప్రైవేట్ ప్రాపర్టీ ద్వారా అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వారిని అడ్డుకోగా.. విధులకు ఆటంకం కలిగిస్తూ, నినాదాలు చేశారన్న ఆరోపణలతో మొత్తం 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీజేపీ లీగల్ టీమ్ హెడ్ రత్నా సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. అరెస్టు చేసిన నేతలను రాత్రి వైపు తమ లాయర్లను కలవడానికి కూడా అనుమతించలేదు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు ప్రైవేట్ వాహనంలో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం బుధవారం ఉదయం 8 గంటలకు మందిర్ మార్గ్‌లోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ (రాజువీ) ముందు హాజరుపరిచారు.

ఢిల్లీ పోలీసు తెలిపిన వివరాలు ప్రకారం.. సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలు గత శనివారం జరిగిన నిరసనల్లో కూడా అదుపులోకి వచ్చి, రూ. 50,000 పూచీకత్తుతో ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని బాండ్ రాసి ఇచ్చారు. అయినప్పటికీ.. వారు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 నిబంధనలను, బాండ్ షరతులను మళ్లీ ఉల్లంఘించారు. సోషల్ మీడియా ద్వారా ఇతరులను కూడా చట్టవ్యతిరేక పనులకు ఉసిగొల్పుతున్నారని, వీరిని బెయిల్‌పై విడుదల చేస్తే మళ్లీ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని స్పష్టం చేస్తూ మెజిస్ట్రేట్ వారికి 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. అజింక్య షిండేను మాత్రం ఆరు నెలల పాటు మంచి ప్రవర్తన కలిగి ఉంటాననే నిబంధనపై రూ. 5,000 షూరిటీతో బాండ్ డౌన్ చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ.. ప్రభుత్వం అసమ్మతి గొంతుకలను నొక్కివేస్తోందని మండిపడ్డారు.

కాగా అక్టోబర్ 11వ తేదీన ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం నిరసనల వేదికల జాబితా నుంచి జంతర్‌మంతర్‌ను తొలగించారు. రామ్‌లీలా మైదాన్, బూరాడీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్‌లను మాత్రమే అనుమతించిన ప్రాంతాలుగా ప్రకటించారు. అయితే రాజధాని నడిబొడ్డున కాకుండా దూర ప్రాంతాలకు నిరసనలను తరలిస్తే ప్రజా ఉద్యమాల ప్రభావం తగ్గుతుందని సీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.

ప్రాణంతీసిన బిర్యానీ

(మొదటి పేజీ తరువాయి)

గురైనట్లు తెలుస్తోంది. మరోవైపు.. మరో 15 మంది తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో.. వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది. రెస్టారెంట్‌లో తీసుకున్న ఆహారం వల్లే బాధితులు అనారోగ్యానికి గురయ్యారా లేక ఘటనకు అసలు కారణం ఏంటి అనే ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి.

నర్సాపూర్-మెదక్ రహదారిలో ఉన్న వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో కొందరు భోజనం చేసిన తర్వాత అస్వస్థతకు గురైనట్లు సమాచారం. బాధితుల్లో పలువురిని కుటుంబ సభ్యులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వారికి చికిత్స అందించారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ చికిత్స పొందుతున్నారు. అయితే బాధితులందరూ ఒకే రకమైన ఆహారం తీసుకున్నారా వారిలో ఎంతమందికి తీవ్రమైన లక్షణాలు కనిపించాయి అనే వివరాలపై పూర్తి అధికారిక సమాచారం వెలువడలేదు. తొలుత అందిన సమాచారం ప్రకారం సుమారు 15 మంది అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

అస్వస్థతకు గురైన వారిలో సాయిరాం అనే 19 ఏళ్ల యువకుడి పరిస్థితి విషమంగా మారింది. దీంతో మెరుగైన వైద్యం కోసం అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే కుటుంబానికి ఈ ఘటన తీరని విషాదాన్ని మిగిల్చింది. కుటుంబానికి అండగా ఉంటాడని ఆశించిన కుమారుడు మృతి చెందడంతో అతడి కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. అయితే సాయిరాం మృతికి, రెస్టారెంట్‌లో తీసుకున్న ఆహారానికి మధ్య సంబంధం ఉందా మరణానికి వైద్యపరంగా నిర్ధారించిన కారణాలు ఏంటి అనే అంశాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. ఈ వివరాలు మెడికల్ రిపోర్టులు, సంబంధిత అధికారుల విచారణ తర్వాత స్పష్టమయ్యే అవకాశం ఉంది.

నిబంధనలు తూచ్

(మొదటి పేజీ తరువాయి)

కేసుల్లో ప్రధానంగా హెల్మెట్ ధరించకపోవడం, ఓవర్ స్పీడింగ్, సీటు బెల్టు పెట్టుకోకపోవడం రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ ఉల్లంఘనలే ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఆధునిక సీసీటీవీ కెమెరాలు, ఏఐ బేస్డ్ ట్రాఫిక్ సర్వేలెన్స్ సిస్టమ్ సహాయంతో ఈ ఉల్లంఘనలను సులభంగా పోలీసులు గుర్తిస్తున్నారు. రోడ్డు భద్రతపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, చలాన్ల సంఖ్య మాత్రం రోజురోజుకూ పెరుగుతూనే ఉండటం గమనార్హం.

పేరుకు పోతున్న పెండింగ్ చాలన్లు

ఒకవైపు కోట్లాది కేసులు నమోదవుతుంటే, మరోవైపు వాటి ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన వందలాది కోట్ల రూపాయల చలాన్ మొత్తం ఇంకా పెండింగ్‌లోనే ఉండిపోయింది. చాలామంది వాహనదారులు చలాన్లను సకాలంలో చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుండటంతో పెండింగ్ బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో పెండింగ్ చలాన్లను వసూలు చేసేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు అమలు చేస్తున్నారు.

కేవలం జరిమానాల భయంతో కాకుండా, తమ ప్రాణ భద్రత కోసమైనా ప్రతీ ఒక్కరూ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని, ప్రయాణంలో హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు లైసెన్స్ రద్దు వంటి చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

తెలంగాణలో విదేశీ మద్యం ధరల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

సుంకాన్ని కేంద్రం తగ్గించిన నేపథ్యంలో రాష్ట్రంలో విదేశీ మద్యం ధరలు పెరగడం చర్చకు దారితీసింది. దిగుమతి సుంకం తగ్గింపు ప్రభావం వినియోగదారులకు నేరుగా అందుతుందని భావించిన ధరల పెంపు నిరాశ కలిగిస్తోంది. సవరించిన ధరల వల్ల మద్యం ప్రియులపై అదనపు భారం పడనుంది.

ఇదిలా ఉండగా, రాష్ట్రంలో కొత్తగా 41 బార్ల ఏర్పాటుకు ఆబ్కారీ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌కు భారీ స్పందన లభించింది. మొత్తం 8,771 దరఖాస్తులు రావడంతో ఒక్కో బార్‌కు సగటున 214 దరఖాస్తులు వచ్చినట్లయింది. ఒక్కో దరఖాస్తుకు తిరిగి చెల్లించని రుసుముగా రూ.లక్ష నిర్ణయించడంతో ప్రభుత్వ ఖజానాకు ఈ రూపంలోనే రూ.87.71 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా.. ఈ నెల 16న లాటరీ ద్వారా బార్ల నిర్వాహకులను ఎంపిక చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

సరస్ మేళాలో గంగపుత్ర మహిళ స్వయం ఉపాధికి ప్రశంసలు



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ మైదానంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సరస్ మేళాను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర సందర్శించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా మల్లారం గ్రామానికి చెందిన సాంప్రదాయ మత్స్యకార గంగపుత్ర మహిళ దుబ్బాక గంగమణి గంగపుత్ర నిర్వహిస్తున్న మొబైల్ ఫిష్ ఫుడ్ అవుట్‌లెట్‌ను ఆయన ప్రత్యేకంగా సందర్శించారు చేపలతో రుచికరమైన వంటకాలను తయారు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్న గంగమణిని గంగపుత్ర అభినందించారు

అనంతరం రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ గంగపుత్ర మహిళలు తమ సంప్రదాయ వృత్తి నైపుణ్యాన్ని ఆధారంగా చేసుకుని చేపల వంటకాల తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందడం అభినందనీయమని అన్నారు ఇటువంటి కార్యక్రమాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మొబైల్ ఫిష్ ఫుడ్ అవుట్‌లెట్ ఏర్పాటుకు అవకాశం కల్పించిన తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖకు, పేదరిక నిర్మూలన సంస్థకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు తెలంగాణ గంగపుత్ర సంఘం తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

సాంప్రదాయ మత్స్యకార కుటుంబాలకు చెందిన మహిళలు ఆధునిక ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగడం సమాజానికి స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు

పీపుల్స్‌డైరీ
వరంగల్
గురువారం, 15 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 207

రైతులకు ఇబ్బంది కలగకుండా పత్తి కొనుగోలు నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్..



భూపాలపల్లి అక్టోబర్ 14 పీపుల్స్ డైరీ.. జిల్లాలో 2026-27 పత్తి మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి అక్టోబర్ మూడో వారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సుని ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఐడిఓసిలోని అదనపు కలెక్టర్ చాంబర్ లో పత్తి కొనుగోళ్ళుపై జిల్లా స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయడంతో పాటు రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు.ఈ సందర్భంగా పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతులకు రవాణా సౌకర్యాలు, పత్తి నాణ్యత పరీక్షలు, తూకాల్లో పారదర్శకత, అగ్నిమాపక భద్రత, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాల కల్పన తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీస్, రవాణా, అగ్నిమాపక, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పత్తి మిల్లర్లు, వ్యాపారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు కొనుగోలు ప్రక్రియకు అవసరమైన సమాచారాన్ని అందు బాటులో ఉంచు కోవాలని తెలిపారు .రైతులు పత్తి విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదు-ర్కోకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేసి నిర్దేశిత నిబంధనల ప్రకారం కొనుగోళ్లు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎఎస్పీ నరేష్ కుమార్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వరంగల్ జనరల్ మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఫైర్ ఆఫీసర్, జిల్లా రవాణా అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారులు, పత్తి మిల్లర్లు, వ్యాపారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలి

- **ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలి-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..**



భూపాలపల్లి అక్టోబర్ 14 పీపుల్స్ డైరీ.. ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు వైద్య సేవలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పిం చాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను సందర్శించి ఎక్స్-రే యూనిట్, ఎం.ఆర్.ఐ. యంత్రం, విద్యుత్ సరఫరా వ్యవస్థ, క్యాజువాలిటీ విభాగం ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఎదు-రవుతున్న సమస్యలపై వైద్యశాల పర్యవేక్షకులను అడిగి తెలుసుకున్నారు.ఎం.ఆర్.ఐ. యంత్రం నిరంతరాయంగా పనిచేసేందుకు అవసరమైన సామర్థ్యం కలిగిన స్టెబిలైజర్, ఆర్మర్డ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేయాలని, ఎక్స్-రే యూనిట్‌కు కూడా అవసరమైన విద్యుత్ సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధి ంచిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించా రు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక క్యాజువాలిటీ విభాగం ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని వైద్యశాల పర్యవేక్షకు లను ఆదేశించారు. అలాగే రోగులకు నిరంతరాయంగా తాగునీరు అందిం చేందుకు ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో వహనాలు ఎక్కడంటే అక్కడ పార్కింగ్ చేస్తున్నారని క్రమపద్ధతి పాటించేందుకు పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయా లని, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన వైద్యశాల పర్యవేక్షకులు డా. వెంకటరత్నం, టీజీఎండీసీ ఈఈ నందు పటేల్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సింగరేణి మండల నూతన కమిటీల ఎన్నిక

- **మండల అధ్యక్షులుగా కాంపాటి రవి మాదిగ, రాయల నరేందర్ మాదిగ ఎన్నిక**
- **సంఘాల బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తాం: నూతన కమిటీ నాయకులు**



సింగరేణి,(కారేపల్లి)అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని గంగమ్మ తల్లి కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఎమ్మార్పీఎస్ (ఏం ఆర్ పి ఎస్), ఎంఎస్‌పీ (ఏం ఎస్ పి) నూతన మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఆదేర్ల అంజయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఖమ్మం జిల్లా ఎంఎస్‌పీ మాజీ అధ్యక్షుడు తురుగంటి అంజయ్య మాదిగ, సింగరేణి మండల మాజీ ఇన్‌చార్జి కనకం జనార్దన్ మాదిగ, సింగరేణి మండల ప్రత్యేక ఇన్‌చార్జి ఆదేర్ల అంజయ్య మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు కేశగాని బాలకృష్ణ,

నూతన కమిటీ ఎన్నికలు ఇలా..

ఏం ఆర్ పి ఎస్ సింగరేణి మండల అధ్యక్షుడిగా కాంపాటి రవి మాదిగ, కార్యదర్శిగా రాయల శ్రీనివాస్ మాదిగ ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా రాయల నరేందర్ మాదిగ, కార్యదర్శిగా దండు ప్రసాద్ మాదిగను ఎన్నుకున్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సభ్యుడిగా తిప్పారపు నాగేంద్రబాబును ఆదేర్ల రామారావును ఎంపిక చేశారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను సంఘాల మండల, జిల్లా నాయకులు అభినందించి సన్మానించారు.

సంఘాల బలోపేతమే లక్ష్యం

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా, మండల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ ఎన్నికను గౌరవప్రదమైన బాధ్యతగా భావిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సంఘాలను మండలంలో మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘాల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆదేర్ల నాగరాజు, లింగపోగు బసవకుమార్, కనకం పవన్‌కళ్యాణ్, రాయల అంజి, మె-రుగు రాజు, ఆదేర్ల నాగార్జున్, ఎర్రవెల్లి పవన్, సిరికొండ రాములు, చింతగుర్తి అంజయ్య, దుపెల్లి శ్రీనివాస్, మెట్టు బాబు, సిరికొండ వెంకన్న, కాంపాటి రమేష్, చిలుముల సైదులు తదితరులు పాల్గొన్నారు.

వంగర లో ప్రభుత్వ (కుంట)భూమి ఆక్రమణ-బోరు వేసి యథేచ్ఛగా వ్యవసాయం

- **జిల్లా ప్రజావాణిలో ఫిర్యాదు**
- **ఫిర్యాదుతో రంగంలోకి దిగిన అధికారులు.. క్షేత్రస్థాయిలో ప్రాథమిక విచారణ**

భీమదేవరపల్లి, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం,మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు స్వగ్రామమైన వంగర శివారులోని ప్రభుత్వ భూమి ఆక్రమణపై అధికారులు చర్యలు ప్రారంభించారు.వంగర శివారులోని లిసర్వే నంబర్ 804లో (22ఖా)లోని సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 'శివయ్యగారి కుంట' (కోలోల్ల కుంట)లిను ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారంటూ గ్రామస్తులు హనుమకొండ కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

కుంటను ఆక్రమించి బోరు బావితో వ్యవసాయం

గ్రామస్తుల ఆరోపణల ప్రకారం.. గత కొంతకాలంగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ కుంట సరిహద్దులను పూడ్చివేసి, బోరుబావి ఏర్పాటు చేసి యథేచ్ఛగా వ్యవసాయం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన నీటి వనరులు, భూమిని ఆక్రమించడం వల్ల కుంట ఉనికికే ప్రమాదం ఏర్పడుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజావాణి ఫిర్యాదుతో క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై స్పందించిన అధికారులు బుధవారం భీమదేవరపల్లి మండలాధికారి ఏడబ్ల్యూఈ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 'శివయ్యగారి కుంట'ను సందర్శించి క్షేత్రస్థాయి ప్రాథమిక విచారణ చేపట్టారు. కుంట సరిహద్దులు, ఆక్రమణకు సంబంధిం చిన ఆనవాళ్లు, బోరుబావి తదితర అంశాలను పరిశీలించారు.

అధికారులు వస్తున్నారని తెలిసి ఆధారాల తొలగింపునకు యత్నం?

అధికారులు విచారణకు వస్తున్నారనే సమాచారం తెలియడంతో సదరు ఆక్రమణదారుడు బోరుబావికి సంబంధించిన పైపులను తొలగించి, మోటారును అక్కడి నుంచి తరలించినట్లు గ్రామస్తులు ఆరోపించారు. తద్వారా ఆక్రమణకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించకుండా చేసేందుకు ప్రయత్నించినట్లు వారు పేర్కొన్నారు.

పూర్తి విచారణ అనంతరం చర్యలు: అధికారి

కుంటను పరిశీలించిన అనంతరం అధికారి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..జిల్లా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో ప్రాథమిక విచారణ చేపట్టామని తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తిని ఆక్రమించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ భూములు, నీటి వనరులను కాపాడాలి

ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులను ఆక్రమణల నుంచి కాపాడాలని, 'శివయ్యగారి కుంట'ను పూర్తిస్థాయి-ిలో సర్వే చేసి హద్దులు నిర్ధారించి, ఆక్రమణలను తొలగించాలని వంగర గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కోట మైసమ్మ దేవస్థానానికి ఎయిర్ కూలర్, ఇనుప బీరువా బహుకరణ

భక్తిశ్రద్ధలతో రూ.5,050 నగదు విరాళం అందజేసిన దంపతులు



సింగరేణి, (కారేపల్లి? అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉ సిరికాయలపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ కోట మైసమ్మ అమ్మవారి దేవస్థానానికి భక్తులు ఎయిర్ కూలర్, ఇనుప బీరువాతో పాటు నగదు విరాళాన్ని అందజేశారు.మహబూబాబాద్ జిల్లా పెద్దగూడూరు మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన అమ్మవారి పరమ భక్తులు తూర్పాటి ఏకాంబరం--మమత దంపతులు దేవస్థాన సేవలో భాగంగా ఒక ఎయిర్ కూలర్, ఒక ఇనుప బీరువాను బహుకరించారు. వీటితో పాటు రూ.5,050 నగదును విరాళంగా సమర్పించి అమ్మవారిపై తమకున్న భక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా దంపతులు తాము సమర్పించిన వస్తువులు, నగదు విరాళాన్ని దేవస్థానం చైర్మన్ పర్స పట్టాభిరామరావు, కార్యనిర్వహణాధికారి (ఈఓ) కె. వెంకటయ్యలకు అందజేశారు.దేవస్థాన అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉదారంగా విరాళాలు అందించిన తూర్పాటి ఏకాంబరం--మమత దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతూ, శ్రీ కోట మైసమ్మ అమ్మవారి కృపాకటాక్షాలు వారిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిక బతుకమ్మ..

రేగొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యదర్శుల బతుకమ్మ వేడుకలు



రేగొండ అక్టోబర్ 14 పీపుల్స్ డైరీ.. బతుకమ్మ పండుగ పర్వదినమును పురస్కరించుకొని రేగొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శుల మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళా కార్యదర్శులు కలిసి బతుకమ్మను అందంగా పేర్చి అందులో గౌరమ్మని ప్రతిష్టించి మహిళ ఉద్యోగులు కలిసి బతుకమ్మను తీసుకువచ్చారు. కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఆటలకు రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక, హాజరై బతుకమ్మ ఆడారు.ఆయా శాఖల మహిళలు బతుకమ్మలతో మండల పరిషత్ కార్యాలయం వద్దకు తరలివచారు. ఆహ్లాద వాతావరణంలో సాగిన బతుకమ్మ వేడుకలు పలువురిని అలరించాయి. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. ఈ వేడుకల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు జీవిత, ఉదయశ్రీ, పద్మ,అమూల్య,జ్యోతి, నవ్య, సుజాత, సునీత, ప్రవంతి, స్వప్న తదితరులు ఉన్నారు. బతుకమ్మ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేసిన మండల పరిషత్ మహిళా ఉద్యోగులకు ఎంపిడిఓ వెంకటేశ్వర రావు, అభినందనలు తెలిపారు..

సింగరేణి కార్మిక గర్జనకు భారీగా తరలిన బిఆర్ఎస్ నాయకులు



భూపాలపల్లి అక్టోబర్ 14 పీపుల్స్ డైరీ.. నల్లబంగారంగా పేరుగాంచిన సింగరేణి సంపదను కొల్లగొడుతూ, కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అధ్యక్షతన గోదావరిఖనిలో నిర్వహిస్తున్న సింగరేణి కార్మిక గర్జన కార్యక్రమానికి భూపాలపల్లి నియోజకవర్గం నుంచి భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, టిబిజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు,యువతతో కలిసి సుమారు 500 మందితో గోదావరిఖనికి బయలుదేరారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం, కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్మిక గర్జన కార్యక్రమానికి భూపాలపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు..

భక్తిశ్రద్ధలతో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు



కొత్తకొండ, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారిని మహాలక్ష్మి అలంకారంలో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ముందుగా గణపతి పూజ, శైవశుద్ధి పుణ్యాహవచనం, సర్వతోభద్ర మండల ఆవాహన, చతుఃషష్టి ఉపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కూష్మాండార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోఆలయ ఈఓ కిషన్ రావు,భక్తులు,అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

- మహనీయుల విగ్రహాలకు ప్రత్యేక రక్షణ కల్పించాలి
- అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్.



భీమదేవరపల్లి, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : మెదక్ పట్టణంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనను తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. మహనీయుల విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ.. భూమి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. మంగళవారం తెల్లవారు జామున మెదక్ పట్టణంలోని వెల్కమ్ బోర్డు సమీపంలో, చేగుంట--హైదరాబాద్, నర్సాపూర్--హైదరాబాద్ ప్రధాన రహదారుల కూడలి వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి కాళ్లు, మెడ విరగ్గొట్టడం తీవ్ర ఆందోళన కలిగించే ఘటన అని పేర్కొన్నారు."విగ్రహాన్ని ధ్వంసం చేయగలరు.. కానీ ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, చరిత్రను ధ్వంసం చేయలేరు" అని ప్రకాష్ స్పష్టం చేశారు. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి, సామాజిక న్యాయ పోరాటానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి సమగ్ర దర్యాప్తు చేపట్టి, విగ్రహ ధ్వంసానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి, సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మహనీయుల విగ్రహాలకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, ముఖ్యమైన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు, తగిన భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. "మహనీయుల విగ్రహాలు కేవలం రాతి ప్రతిమలు కావు. అవి సమాజ మార్పు కోసం సాగిన పోరాటాలకు సజీవ గుర్తులు. వాటిని ధ్వంసం చేయడం అంటే సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం పోరాడిన చరిత్రను అవమానించడమే" అని ప్రకాష్ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, మహనీయుల విగ్రహాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తొందూరి ఎల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి కండే సుధాకర్, భీమదేవరపల్లి మండల రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక మండల అధ్యక్షులు ఉప్పుల కుమారస్వామి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాక రమేష్, బీసీ ఉద్యమ నాయకులు, అక్కన్నపేట జేఏసీ ఇన్‌చార్జి వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు అవార్డు జాబితాపై ఆర్డీవో విచారణ



భీమదేవరపల్లి అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి అవార్డు జాబితాపై ఆర్డీవో ఎన్. వెంకటేష్ విచారణ చేపట్టారు. ప్రాజెక్టు పరిధిలోని కోతకొండ, గట్ల నర్సింగాపూర్, ముస్తాఫాపూర్, ముల్కనూర్, వంగర, మల్లారం, ముత్తారం గ్రామాలకు సంబంధించిన అవార్డు జాబితాపై వివరాలు పరిశీలించి, సంబంధిత గ్రామాల ప్రజల నుంచి సమాచారం తెలుసుకున్నారు.ఈ విచారణలో భీమదేవరపల్లి తహసీల్దార్ బి. రాజేష్‌తో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అవార్డు జాబితాలోని వివరాలపై అధికారులు విచారణ జరిపారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయ పక్షపాతం తగదు

అర్హులైన ప్రతి కుటుంబానికీ న్యాయం చేయాలి: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కండె సుధాకర్



భీమదేవరపల్లి, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ పక్షపాతం లేకుండా,అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సీనియర్ నాయకులు కండె సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కుటుంబాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందినవి కావని, ప్రజాస్వామ్య వ్యవస్థలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలని పేర్కొన్నారు. కొంతమంది అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అర్హులైన కుటుంబాలను పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇళ్లు మంజూరు చేయించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయని కండె సుధాకర్ అన్నారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని డిమాండ్ చేశారు.ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియను ప్రజలు గమనిస్తున్నారని, అర్హులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం పక్షపాత ధోరణికి స్వస్తి పలికి, అర్హులే ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని ఈ సందర్భంగా కండె సుధాకర్ కోరారు.

ఉత్తమ సేవలు గుర్తించి పోలీసులకు ప్రశంసా పత్రాలు అందచేసిన కరీంనగర్ సిపి గౌస్ ఆలం



వీణవంక అక్టోబర్ 15(పీపుల్స్ డైరీ) : వీణవంక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఆవుల తిరుపతి హెడ్ కానిస్టేబుల్ నెల్లి మోహన్, కానిస్టేబుళ్లు గిన్నారపు రవి, నల్ల కోమల్, కుర్రే ప్రవల్లికలు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ప్రశంసా పత్రాలను అందజేశారు.విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన సేవలు అందించిన పోలీసు సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వారిని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని వారు తెలిపారు.

ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల తీరుతో పండగ పూట పస్తులేనా...

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ డిమాండ్.



హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) అక్టోబర్ 14: స్వచ్ఛ కార్మికులుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ కార్మికులు జిల్లా వ్యాప్తంగా 950 మంది స్వచ్ఛ కార్మికులు పనిచేస్తున్నారు అందులో ప్రాథమిక పాఠశాలలో 582, ప్రాథమి కోన్నత పాఠశాలలో 150 మంది, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 222 మంది స్వచ్ఛ కార్మికులు జిల్లా వ్యాప్తంగా 950 మందికి పైగా పని చేస్తున్నారని 2025-2026 విద్యాస ంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి,మార్చి ఏప్రిల్ వరకు, 2026-2027 విద్య సంవత్సరంలో జూన్,జూలై ఆగస్టు,సెప్టెంబర్ వరకు వేతనాలను పెండింగ్ లో ఉన్నాయని ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ అధికారుల పనితీరు వల్ల కార్మికులకు నెల నెలా అందించకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలంగాణ రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ ఫ్యాక్టరీ,గనుల శాఖ మంత్రి సిద్దిపేట జిల్లా ఇంచార్జి మంత్రి వర్యాలు జి.వివేక్ వెంకటస్వామి, హుస్నాబాద్ శాసన సభ్యులు రాష్ట్ర రోడ్డు రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి వర్యాలు పోన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వచ్ఛ కార్మికుల దీర్ఘ కాలికంగా రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గడిపె మల్లేశ్ కోరారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్



హుజూరాబాద్ ,అక్టోబర్ 14, (పీపుల్స్ డైరీ) : అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ, వారికి ఆర్థిక భరోసా కల్పించి సొంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని 29వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటిని నిర్మించుకోవాలనే కలతో ఎదురుచూస్తున్న తమ ఆశయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, వొడితల ప్రణవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంతింటి భరోసా కల్పిస్తున్నామని, రెండో విడతలోనూ అర్హులైన లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని ప్రణవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, స్థానిక కౌన్సిలర్ మొగిలి, ఇతర కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిక బతుకమ్మ

రేగొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యదర్శుల బతుకమ్మ వేడుకలు..



రేగొండ అక్టోబర్ 14 పీపుల్స్ డైరీ.. బతుకమ్మ పండుగ పర్వదినమును పురస్కరించుకొని రేగొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శుల మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళా కార్యదర్శులు కలిసి బతుకమ్మను అందంగా పేర్చి అందులో గౌరమ్మని ప్రతిష్టించి మహిళ ఉద్యోగులు కలిసి బతుకమ్మను తీసుకువచ్చారు. కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఆటలకు రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక, హాజరై బతుకమ్మ ఆడారు.ఆయా శాఖల మహిళలు బతుకమ్మలతో మండల పరిషత్ కార్యాలయం వద్దకు తరలివచారు. ఆహ్లాద వాతావరణంలో సాగిన బతుకమ్మ వేడుకలు పలువురిని అలరించాయి. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. ఈ వేడుకల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు జీవిత, ఉదయశ్రీ, పద్మ,అమూల్య,జ్యోతి, నవ్య, సుజాత, సునీత, స్రవంతి, స్వప్న తదితరులు ఉన్నారు. బతుకమ్మ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేసిన మండల పరిషత్ మహిళా ఉద్యోగులకు ఎంపిడిఓ వెంకటేశ్వర రావు, అభినందనలు తెలిపారు..

మంచినీటి సమస్యకు పరిష్కారం చూపిన సర్పంచ్ భద్రు నాయక్

నూతన విద్యుత్ మోటారు ఏర్పాటు



మహబూబాబాద్-అక్టోబర్ 14(పీపుల్స్ డైరీ): చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ దేశ్యతండ గ్రామ ప్రజల మంచినీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ గుగులోత్ భద్రు నాయక్ కీలక నిర్ణయం తీసుకున్నారు.గ్రామంలో నెలకొన్న తీవ్ర తాగునీటి ఎద్దడిని నివారించేందుకు తక్షణ చర్యలో భాగంగా నూతన విద్యుత్ మోటారును ఏర్పాటు చేయించారు.గత కొన్ని రోజులుగా పాత మోటారు పదేపదే మరమ్మతులకు గురి కావడం,నీటి లభ్యత తగ్గడం వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.సమస్యను గుర్తించిన సర్పంచ్ పంచాయతీ నీధులతో ప్రత్యేక చొరవ చూపి కొత్త విద్యుత్ మోటారున కొనుగోలు చేసే విజయవంతంగా బిగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరాయంగా ఎలాంటి ఆటంకాలు లేకుండా స్వచ్ఛమైన తాగునీరు సత్వరమే అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్, గ్రామపంచాయతి సిబ్బంది రాందాస్, సర్వన్, వెంకన్న, సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి..సిపిఎం డిమాండ్



మహబూబాబాద్ -అక్టోబర్ 14(పీపుల్స్ డైరీ) : గార్ల మండల పరిధి,పినిరెడ్డిగూడెం గ్రామశీలో వేసవికాలం రాక ముందే మంచినీటి ఇబ్బందులు వస్తున్నాయని అధికారులు,పాలక వర్గం దృష్టి సారించి నీటి ఎద్దడి తీర్చేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల నాయకులు వి.వెంకటేశ్వర్లు,ఎం నాగమణి,సిహెచ్ ఎల్లయ్య లు డిమాండ్ చేశారు. పినిరెడ్డిగూడెంలో జి.సీతారాం అధ్యక్షతన బుధవారం జరిగిన సిపిఎం గ్రామశాఖ సమావేశంలో వారు మాట్లాడుతూ,ఎల్ నీనో ప్రభావంతో నీటి వనరులు తగ్గిపోయే ప్రమాదం ఉందని ప్రభుత్వమే చెప్తుందని, అలాంటప్పుడు ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు చొరవ చూపాలని కోరారు.మంచినీటి బావికి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ అధిక లోడ్ సమస్య కారణంగా నీటి సరఫరాలో పదేపదే అంతరాయం కలుగుతుందని దీనికి తోడు మిషన్ భగీరథ నీరు రెగ్యులర్ గా రాకపోవడంతో గ్రామానికి నీరు అందించేందుకు మరో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో నీటి కోసం ప్రజలు, మూగ జీవాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అదనంగా బోరు బావిని ఏర్పాటు చేయాలని కోరారు.మంచినీటి ట్యాంకు వద్ద పైపు పగిలి నీరు వృధాగా పోతున్నాయని వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు వి.కొండయ్య, పద్మ,వెంకట్,ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా రహిత సమాజమే లక్ష్యం

గార్ల -బయ్యారం సీఐ ఎల్. రవీందర్...



మహబూబాబాద్-అక్టోబర్ 14(పీపుల్స్ డైరీ) : నాటు సారా తయారు చేసిన, విక్రయించిన,రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని గార్ల -బయ్యారం సిఐ రవీందర్ హెచ్చరించారు.బుధవారం గార్ల మండల పరిధి బుద్దారం గ్రామంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా గుడుంబా స్థావరాలపై సామూహికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 300 లీటర్ల బెల్లం పానకాన్ని ద్వసించేసి,20 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పర్చుకున్నారు.32 వాహనాలను సీజ్ చేశారు.ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ, మహబూ బాబాద్ ఎస్పీ డాక్టర్ శబరిస్ ఆదేశాల మేరకు గుడుంబా స్థావరాలపై విస్తృతంగా దాడులు చేస్తున్నామని తెలిపారు.గ్రామస్తులకి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు,రోడ్డు భద్రత, మత్తు పదార్థాలు, ఇంట్లో పిల్లలు ప్రవర్తన పై అవగాహన కల్పించాలని పిల్లలతల్లిదండ్రులకు సూచించారు. చట్టవ్యతిరేక చర్యలు పాల్పడితే కఠిన చర్యలుతప్పవని హెచ్చరించారు.25 సంవత్సరాల వయసు పిల్లలు గుడుంబాకు మత్తుకు బానిసలై తమ జీవితాలను మధ్యంతరంగా ముగిసిపోతున్నాయన్నారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు.గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గార్ల ఎస్సై బి. సాయికుమార్, బయ్యారం ఎస్సై ప్రశాంత్ బాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాపై కావాలనే తప్పుడు ప్రచారం- కాంగ్రెస్ సీనియర్ నేత పత్తి కృష్ణారెడ్డి

- ఆధారాల్లేని ఆరోపణలు చేస్తే

న్యాయపోరాటం తప్పదు

హుజురాబాద్, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : రాజకీయ దురుద్దేశంతో కొందరు తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని వెంకట్రావుపల్లి సర్పంచ్ అనిత భర్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పత్తి కృష్ణారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆధారాలు లేని ఆరోపణలతో తన ప్రతిష్ఠను దిగజార్చాలని చూస్తే సహించేది లేదని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి చట్టపరంగా తగిన గుణపాఠం చెబుతానని హెచ్చరించారు.బుధవారం హుజురాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజనీకుమార్ యాదవ్ తనపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆ ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని, కల్పిత కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.

2019లోనే భూమి రిజిస్ట్రేషన్

తనపై ఆరోపణలకు కారణమైన భూ వ్యవహారంపై కృష్ణారెడ్డి వివరణ ఇచ్చారు. 2019లో తన సొంత



సోదరుడు పత్తి విష్ణువర్ధన్ రెడ్డి నుంచి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎకరం నాలుగు గుంటల భూమిని చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎలాంటి అక్రమాలకు తావులేదని, అంతా పారదర్శకంగానే జరిగిందని స్పష్టం చేశారు.

భూమిని కాజేసేందుకే కుట్ర

ఈ వ్యవహారంలో ఆరోపణలు చేస్తున్న మృతికి చెందిన ఓదెలుతో గానీ, ఆయన కుమారుడితో గానీ తనకు ప్రత్యక్ష ఆర్థిక సంబంధాలు, లావాదేవీలు లేవని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. తన సోదరుడు విష్ణువర్ధన్ రెడ్డికి సంబంధించిన బకాయిల విషయంలో కుటుంబ బాధ్యతగా ఆ మొత్తాన్ని చెల్లించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నానని చెప్పారు గతంలో బకాయి కింద రూ. 2.70 లక్షల చెక్కు ఇచ్చేందుకు ముందుకు వచ్చినప్పటికీ, దానిని ఉద్దేశపూర్వకంగానే తిరస్కరించారని ఆరోపించారు. బకాయి వసూలు చేయడం కంటే విలువైన భూమిని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో కొందరి అండదండలతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

తప్పుడు ప్రచారం ఆపకపోతే పరువునష్టం దావా

రాజకీయ ప్రయోజనాల కోసం తనపై అసత్య ప్రచారం చేస్తూ సమాజంలో తన పరువుప్రతిష్ఠలను దెబ్బతీయాలని చూస్తున్నారని కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరువునష్టం దావాతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోనని పత్తి కృష్ణారెడ్డి హెచ్చరించారు.

బతుకమ్మ ఏర్పాట్లపై ప్రణవ్ ప్రత్యేక దృష్టి

మహిళలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి: వొడితల ప్రణవ్



హుజురాబాద్, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. ప్రకృతిని పూల రూపంలో పూజిస్తూ, తెలంగాణ ఆడపడుచుల జీవన వైభవాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని ఆయన పేర్కొన్నారు.బుధవారం హుజురాబాద్ పట్టణంలోని బతుకమ్మ సద్దుల పండుగ, నిమజ్జనానికి సంబంధించి కొనసాగుతున్న ఏర్పాట్లను వొడితల ప్రణవ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. బతుకమ్మ నిమజ్జన సమయంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తగినంత లైటింగ్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.పండుగకు వచ్చే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సద్దుల బతుకమ్మ వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు మున్సిపల్ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందే

వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు జక్కోజు భిక్షపతి



సైదాపూర్ అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరించడం సరికాదని వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు జక్కోజు భిక్షపతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భూక్యా యాదగిరికి ఆయన సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిబంధనల ప్రకారం దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సొంత ఇల్లు లేక ఎంతోమంది నిరుపేద దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, రిజర్వేషన్ ప్రాతిపదికన అర్హులైన ప్రతి దివ్యాంగుడికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొంకట కిష్టయ్య, ఆవుల పద్మ ఉన్నారు.

ఎన్నికలప్పుడే రామ్ నగర్ కు..?ఆ తర్వాత రాం రాం..!

దళిత కాలనీ అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం..?

చిట్యాల, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : ఒకపక్క రాష్ట్రంలోని దళిత వాడలను కాలనీలను అభివృద్ధి చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తుంటే పథకాలను అమలు చేస్తుంటే ఇక్కడ మాత్రం వ్యతిరేకంగా జరుగుతుంది. దళితుల అభివృద్ధి పట్ల ప్రభుత్వాలు అధికారులు ప్రజా ప్రతినిధులు నాయకులు పనిచేస్తుంటే ఇక్కడ మాత్రం ఇంకా వివక్షతే కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది. ఎన్నికలప్పుడే కానీకి వస్తాము... ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నాక..కాలనీకి రాం రాం అనే చందంగా ఉంది మండల కేంద్రంలోని ఓ దళిత కాలనీ పరిస్థితి. వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని రామ్ నగర్ కాలనీ ఒక ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసే అంత జనాభా ఉన్న కాలనీ. కాలనీలో దాదాపు గత 100 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన కరెంటు స్తంభాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాత వాటి స్థానంలో కొత్త కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి అధికారులను ప్రజాప్రతినిధులను నాయకులను రామ్ నగర్ ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా ఇండ్ల పై నుండి కరెంటు వైర్లు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే ఇంకా కొన్ని చోట్ల కరెంటు స్తంభాలు సైడ్ డ్రైనేజీ కాలువలు అవసరం ఉండగా వాటి ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని కరెంటు స్తంభాల మధ్య వైర్లు జోలపడి ఉన్నాయి. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపణలు



వినిపిస్తున్నాయి. దాదాపు గత 80 లేదా 90సంవత్సరాల క్రితం కాలంలోని కొన్ని ఇండ్ల లోపల కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయడం వలన ఆ ఇండ్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఆ ఇండ్ల మొత్తానికి కరెంటు షాక్ వస్తుందని దాంతో కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులు ఉన్నా కూడా రాంనగర్ దళిత కాలనీ కాబట్టి ఎవరు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అందరు నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే కాలనీకి వచ్చి అచ్చిరాని ఎన్నికల హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుంటారు తప్ప కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి ఖచ్చితమైన పనులు చేయడంలో మాత్రం వెనుకడుగు వేస్తారు అనే విమర్శలు ఉన్నాయి. ఒకవైపు ప్రభుత్వం గ్రామాల్లో ఎటువంటి ప్రజా సమస్యలు లేకుండా ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులు పనిచేయాలని చెబుతున్న మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి మాత్రం ఇది వర్తించడం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులు స్పందించి కాలనీ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. కాలనీలో లూజు కరెంటు వైర్లు జోలపడి ఇండ్లపైన వేలాడుతున్నాయని వాటిని సరి చేయాలని కూడా కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఎన్ని సమస్యలు ఉన్నా కూడా ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు ఈ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఆ తర్వాత మర్చిపోతున్నారు. ఒకవైపు ప్రభుత్వం దళిత కాలనీలను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని చెబుతున్న అమలులో మాత్రం ప్రజా ప్రతినిధులు అధికారులు నాయకులు శ్రద్ధ చూపించడం లేదని కాలనీలోని పలు సమస్యలను కనీసం తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం కూడా చేయకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుందని కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఎన్నికలప్పుడే కాలనీకి క్యూలు కట్టి ఓట్లు అడగడం కాకుండా అభివృద్ధి పనులు చేసి కాలనీ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పనులు చేయించే దమ్మున్న ప్రజా ప్రతినిధులను నాయకులను ఎన్నుకోవాలని అలాంటి వారే రావాలని కావాలని ప్రజలు కోరుతున్నారు.

డీఆర్డీఓ గీతకు ఘన సన్మానం-వెంకటేశ్వర్లపల్లిలో 'ఆసరా' పెన్షన్ల విచారణ

- అధికారినిని సత్కరించిన సర్పంచ్

రాయిశెట్టి చంద్రయ్య

సైదాపూర్ అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం అర్హులైన లబ్ధిదారుల కోసం 'ఆసరా' పెన్షన్ల ఎంక్వయిరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరీంనగర్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిణి (డీఆర్‌డీఓ) గీతకు సర్పంచ్ రాయిశెట్టి చంద్రయ్య, పంచాయతీ సిబ్బంది సాదర స్వాగతం పలికారు.గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఆసరా పెన్షన్ల లబ్ధిదారుల అర్హతలను, వారి దరఖాస్తులను డీఆర్‌డీఓ గీత క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా, పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సంక్షేమ ఫలాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. గ్రామంలో పెన్షన్ల ఎంక్వయిరీని విజయవంతంగా నిర్వహించినందుకు, గ్రామానికి విచ్చేసిన డీఆర్‌డీఓ గీతను సర్పంచ్ రాయిశెట్టి చంద్రయ్య శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, సన్మానం చేసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం తిరుపతి, పంచాయితీ కార్యదర్శి కొండాల్ రెడ్డి, సీసీ పర్షరాములు, సీఏ రజిత పాల్గొన్నారు.



బతుకమ్మ ఉయ్యాల పాటలు విడుదల

గ్రామీణ జానపద కళారుపాలను కాపాడుకుందాం.టివి,రెడియో జానపద గాయకులు గడిపె మల్లేశ్



హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) అక్టోబర్ 14 : నేడు కంప్యూటర్ యుగంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న జానపద కళారూపాలు డిజె డిస్కో సంగీతం మోతల వల్ల దిన దినం జానపద కళారూపాలు మరింత కనుమరుగై పోతున్నాయని టివి రెడియో జానపద గాయకులు గడిపె మల్లేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామీణ జానపద కళారూపాలను నమ్ముకొని ప్రజలను చైతన్య పరుస్తూ జీవనం సాగిస్తున్న గ్రామీణ వృత్తి కళాకారులను కళారుపాలను కాపాడేందుకు నిరుద్యోగ యువ కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని గడిపె మల్లేశ్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపెట రోడ్డులోని బియాండ్ ఎక్స్ పెక్టేషన్ ఈవెంట్స్ హాల్లో బతుకమ్మ ఉయ్యాల పాటలను గాయని మణులు దబ్బెట తిరుమల, నానవేన భాగ్యలక్ష్మి, పులిపిరి లలిత, బొల్లం సౌందర్య సేకరణ,రచన,గానం చేసిన రెండు బతుకమ్మ ఉయ్యాల పాటలకు గడిపె మల్లేశ్ సంగీతం అందించిన పాటలను కళాకారులు కళా పోషకుల సమక్షంలో గడిపె మల్లేశ్ విడుదల చేసారు. ఈకార్యక్రమంలో గాయణి మణులు దబ్బెట తిరుమల,పులిపిరి లలిత,నానవేన భాగ్యలక్ష్మి, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, మహిళా సమాఖ్య నాయకురాలు రాయిళ్ళ శోభరాణి, కళాపోషకులు అయిలేని మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కోహెడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శెట్టి సుధాకర్.



కోహెడ అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ కోరారు. ధర్మసాగర్పల్లి, శనిగరం గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా శెట్టి సుధాకర్ మాట్లాడుతూ, మాజీ సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ అధ్యక్షులు, ఇతర నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు.రాబోయే రోజుల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గామాత ను దర్శించుకున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిడిశెట్టి రాజు

కోహెడ అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : హుస్నాబాద్ నియోజకవర్గం వివిధ మండలలలో కేంద్రంలోని ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారు లను దర్శించుకున్న భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ బతుకమ్మ, దేవి శరన్నవరాత్రి విజయదశమి పండగ శుభాకాంక్షలు తెలిపారు.మహిళలకు ఎంతో పవిత్రమైన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు దీక్షపరులు, మహిళాలు భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రతిరోజు ఒక అలంకరణతో అమ్మవారిని దర్శించుకోవడం జరుగుతుంది.అమ్మవారి ఆశీస్సులతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రజలందరూ రైతులు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని కోరుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి గ్రామస్తులు దీక్షపరులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మిత్ర పురుగులతో పంటకు మేలు...

మిత్ర పురుగులను సంరక్షించుకోవాలి ఉదయ శంకర్ సహాయ సస్యరక్షణ అధికారి



మహబూబాబాద్-అక్టోబర్ 14(పీపుల్స్ డైరీ): పురుగు మందుల వినియోగంలో మిత్ర పురుగులకు హాని కలగకుండా జాగ్రత్త తీసుకోవాలని అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయ శంకర్ సూచించారు. గార్ల మండల పరిధి మద్దివంచ గ్రామంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం వారి ఆధ్వర్యంలో రైతులకు పంటలలో మిత్ర పురుగులు,శత్రు పురుగుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంటలను నాశనం చేసే శత్రు పురుగులతో పాటు పంటకు మేలు చేసే మిత్ర పురుగులు కూడా ఉంటాయని తెలిపారు.మిత్ర పురుగులు ఎక్కువ నిష్పత్తిలో ఉంటే పురుగుమందు పిచికారి చేయకూడదన్నారు. ఈ సందర్భంగా రైతులకు ట్రైకోడెర్మా వీరిడి జీవ శీలింద్రం నాశని ఉపయోగాన్ని ఎలావాడాలో వివరించారు. అనంతరం రైతులకు ట్రైకోడెర్మాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ అధికారి బసవన్నప్ప,మండల వ్యవసాయ విస్తరణ అధికారి మేఘన, ఉప సర్పంచ్,గ్రామపంచాయతీ కార్యదర్శి,గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణలో శ్రీ గణేశ దుర్గ భవాని అసోసియేషన్

అమ్మవారి సన్నిధిలో ఎస్సై రాజు.. ఉత్సవాల ఏర్పాట్లపై ప్రశంసలు



భీమదేవరపల్లి, అక్టోబర్ 14, (పీపుల్స్ డైరీ) : శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వివేకానంద యూత్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు చండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం శ్రీ గణేశ దుర్గ భవాని అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముల్కనూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారి సన్నిధికి చేరుకున్న ఎస్సై రాజుకు వివేకానంద యూత్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వివేకానంద యూత్ సభ్యులు ఎస్సై రాజును శాలువాతో సన్మానించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అలంకరణలు, డెకరేషన్‌ను ఎస్సై రాజు అభినందించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టిన శ్రీ గణేశ దుర్గ భవాని అసోసియేషన్ సభ్యులకు వివేకానంద యూత్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భవిష్యత్ తరాలకు సంస్కృతి, సంప్రదాయాలను అందించాలి..

హుస్నాబాద్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.రేవతి



హుస్నాబాద్. టౌన్: (పీపుల్స్ డైరీ) అక్టోబర్ 14 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి బి. రేవతి అన్నారు. బుధవారం హుస్నాబాద్ కోర్టు ఆవరణలో మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలిసి ఆమె బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆడిపాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూలను గౌరమ్మగా పూజిస్తూ తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించి బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం తెలంగాణ ఆడపడుచుల ప్రత్యేకత అన్నారు. మన పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ యువత, మహిళలు, విద్యార్థులు భావితరాలకు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని మల్లేశం, మహిళా న్యాయవాదులు సబ్బని శ్రీదేవి, రాజ్యలక్ష్మి, సంధ్యారాణి, మాధవి, కోర్టు మహిళా సిబ్బంది స్వప్న, మౌనిక, శైలజ, ఇందిర, మానసతో పాటు న్యాయవాదులు యాల్ల శ్రీనివాస్ రెడ్డి, బాకం సంపత్ కుమార్, ఒగ్గోజు సదానంద చారి, కన్నోజు రామకృష్ణ, మురళీమోహన్, జుమ్లాల్ నాయక్, జె.కిరణ్ కుమార్, సురేష్, సంపత్, అరుణ్ తేజ, విశ్వ తేజ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు దశాబ్దాల అనుబంధం..అనేక మధుర జ్ఞాపకాలు..ఆత్మీయ మిత్రుల కలయిక

- ఎందరికో స్ఫూర్తినిస్తున్న క్రీడామైదానం!
- ఆవునూరి సమ్మయ్య



హుజూరాబాద్, అక్టోబర్ 14,(పీపుల్స్ డైరీ): హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంతో విడదీయలేని అనుబంధం.. బాల్య స్మృతుల నుంచి సామాజిక ఉద్యమాల వరకు ఎన్నో అనుభవాలకు సజీవ సాక్ష్యం.. కాలం మారినా చెక్కుచెదరని మిత్రుల ఆత్మీయతకు చిరునామా..హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదా నంతో నాకున్న అనుబంధం ఆరు దశాబ్దాలకు పైబడింది. ఈ మైదానం నా బాల్య జ్ఞాపకాలకే కాదు.. జీవిత ప్రయాణంలో పరిచయమైన ఎందరో మిత్రుల ఆత్మీయతకు, సామాజిక సంబంధాలకు, మానవీయ అనుబంధాలకు సజీవ సాక్ష్యం. ఇటీవల హుజూరాబాద్ పర్యటన సందర్భంగా ఈ మైదానాన్ని సందర్శించినప్పుడు గత స్మృతులన్నీ ఒక్కసారిగా మనసులో మెదిలాయి. మిత్రుల ఆత్మీయ పలకరింపులు ఆనందాన్ని నింపగా, గత అనుభవాలు మదిలో మధుర జ్ఞాపకాలుగా కదలాడాయి.

మిత్రుల కలయికతో మదిలో ఆనందాల సందడి

ఈ నెల 13వ తేదీన ఉదయం ఏడు గంటలకు సామాజిక ఉద్యమ సహచరుడు, ఆత్మీయ మిత్రుడు పల్కల ఈశ్వర్ రెడ్డిని కలవాలనే ఉద్దేశంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానానికి వెళ్లాను.మైదానంలోకి అడుగుపెట్టగానే ఇంగ్లీషు ఉపాధ్యాయుడు సత్యం, హిందీ ఉపాధ్యాయుడు భిక్షపతి వాకింగ్ చేస్తూ ఆప్యాయంగా పలకరించారు. ఆ వెంటనే వచ్చిన వస్త్ర వ్యాపార ప్రముఖుడు గోలి శ్రీనివాస్‌తో ఆలింగనం, ఆత్మీయ పలకరింపులు జరిగాయి. ఇలా ఒక్కొక్కరుగా మిత్రులు ఎదురుపడటంతో ఆ ప్రాంగణమంతా ఆత్మీయతతో నిండిపోయింది. అక్కడి బాస్కెట్‌బాల్ మైదానంలో పెద్ద సంఖ్యలో వాకర్స్ హాజరయ్యారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుపొందిన ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది ముక్కెర రాజు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ హుజూరాబాద్ డిపో కార్యదర్శి ఠాకూర్ శివదయాల్ సింగ్‌లను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, కార్యదర్శి మతీన్ ఆధ్వర్యంలో సన్మానిస్తున్నారు.ఈ విషయాన్ని మిత్రుడు ఈశ్వర్ రెడ్డి నాకు తెలియజేసి, సన్మాన కార్యక్రమంలో భాగస్వామిని చేశారు. మరో మిత్రుడు వేల్పుల రత్నం కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.అక్కడున్న మిత్రులందరి ఆత్మీయ పలకరింపులు నాకు ఎనలేని సంతోషాన్ని కలిగించాయి. ప్రతి ఒక్కరినీ పేరుపెట్టి పలకరించాను. వారితో నాకున్న మానవీయ సంబంధాలు, ఆత్మీయ అనుబంధాలు కాలంతో చెరిగిపోయేవి కావు.

బాల్య స్మృతులకు చెరగని చిరునామా

మిత్రులతో మాట్లాడుతుండగానే ఈ క్రీడామైదానంతో నాకున్న అనుబంధం, ఇక్కడ గడిపిన బాల్యదినాలు ఒక్కొక్కటిగా గుర్తుకొచ్చాయి.మా ఇల్లు ఈ మైదానానికి సమీపంలో ఉండటంతో చిన్నతనం నుంచే ఇక్కడితో అనుబంధం ఏర్పడింది. నాకే కాదు.. నా కంటే ముందు తరానికి చెందిన హుజూరాబాద్ పట్టణవాసులతో పాటు ప్రస్తుత తరానికి చెందిన వారికీ ఈ మైదానంతో విడదీయలేని సంబంధం ఉంది. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఈ మైదానంలో ఎన్నో ఆటలను చూశాను. కొన్నింటిని ఆడాను కూడా. చిర్రగోనే, గోళీలాట, కప్పగంతులు, మూడుకాళ్ల పరుగు, కోతికొమ్మచ్చి వంటి ఆటలు అప్పటి బాల్యాన్ని ఎంతగానో అలరించేవి. నేటి తరానికి ఈ ఆటలు అంతగా పరిచయం లేకపోవచ్చు. కానీ మా తరానికి మాత్రం అవి మరచిపోలేని మధుర జ్ఞాపకాలు.

విద్యార్థుల ప్రార్థనలతో.. మార్చింగ్ బ్యాండ్ నాదాలతో

ఈ క్రీడామైదానాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం ప్రార్థన జరిగే సమయంలో మైదానమంతా విద్యార్థులతో నిండిపోయేది. ప్రార్థన ముగిసిన తర్వాత విద్యార్థులే వాయించే మార్చింగ్ బ్యాండ్ శబ్దాలతో ప్రాంగణం మారుమోగేది.విద్యార్థులంతా తమతమ తరగతి గదులకు చేరుకోవడానికి దాదాపు అరగంట సమయం పట్టేది. ఒక్కో తరగతిలో ఏ, బీ, సీ, డీ అంటూ నాలుగు సెక్షన్లు ఉండేవి. అప్పట్లో ప్రైవేటు పాఠశాలల ఉనికి దాదాపుగా లేదు. ప్రభుత్వ పాఠశాలలే విద్యకు ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. సాయంత్రం వేళల్లో ఎన్‌సీసీ, స్కౌట్స్ విద్యార్థుల కార్యకలాపాలతో మైదానం సందడిగా ఉండేది. విద్యార్థుల క్రమశిక్షణ, ఆటపాటలు, శిక్షణ కార్యక్రమాలు ఈ ప్రాంగణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి.

హాకీ నుంచి ఫుట్‌బాల్ వరకు.. క్రీడలతో కళకళలాడిన మైదానం

క్రీడల విషయానికి వస్తే హాకీ, కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ వంటి ఆటలతో పాటు లాంగ్‌జంప్, హైజంప్, పరుగు పందేలు తదితర క్రీడా కార్యకలాపాలతో మైదానం నిత్యం సందడిగా ఉండేది.క్రీడా పోటీలు జరిగే సమయంలో వేలాది మంది పట్టణ ప్రజలు మైదానానికి తరలివచ్చేవారు. ఆ సమయంలో ఈ ప్రాంగణం ఒక పెద్ద క్రీడా స్టేడియంలా కనిపించేది. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ప్రేక్షకులు చేసే సందడి, పోటీల్లో కనిపించే ఉత్సాహం ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయి. హాకీ మైదానానికి, ఫుట్‌బాల్ మైదానానికి మధ్య వరుసగా నిలిచిన వేపచెట్లు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేవి. వాటి నీడలో క్రీడాకారులు, ప్రేక్షకులు సేదతీరేవారు. ఆ చెట్లు మైదానానికి సహజ సౌందర్యాన్ని అద్దేవి.

అప్పకొండ మాచారి హయాంలో బాస్కెట్‌బాల్ మైదానం

అప్పకొండ మాచారి ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న సమయంలో బాస్కెట్‌బాల్ మైదానంతో పాటు దాని పక్కనే పెద్ద వేదికను నిర్మించారు. మా బ్యాచ్ చదువుతున్న సమయంలోనే ఆయన హయాంలో బాస్కెట్‌బాల్ మైదానం ప్రారంభమైంది. అందువల్ల ఆ మైదానంతో మా తరానికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది.దాని పక్కనే ఉన్న గ్రంథాలయం కూడా ఎందరో విద్యార్థులకు, పాఠకులకు విజ్ఞానాన్ని అందించింది. పుస్తకాల ద్వారా ఆలోచనలను విస్తరించుకోవడానికి, సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవడానికి ఆ గ్రంథాలయం ఎంతగానో దోహదపడింది.ఈ మైదానం నుంచి ఎందరో క్రీడాకారులు ఎదిగారు. నేటికీ పలువురు యువకులు ఇక్కడ క్రీడల్లో శిక్షణ పొందుతూ తమ ప్రతిభను చాటుకునేందుకు ముందుకు సాగుతున్నారు.

కాలం మారినా.. తగ్గని క్రీడా సందడి

కాలం మారినా ఈ మైదానానికి ఉన్న ప్రాధాన్యం తగ్గలేదు. ఇప్పటికీ వివిధ క్రీడలతో ఈ ప్రాంగణం ప్రతిరోజూ ఒక క్రీడా పండుగను తలపిస్తోంది. ఉదయం వేళల్లో వందలాది మంది వాకింగ్ కోసం ఇక్కడికి వస్తుంటారు.వయసుతో సంబంధం లేకుండా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఒకచోట చేరడం, పరస్పరం పలకరించుకోవడం, తమ అనుభవాలను పంచుకోవడం ఈ మైదానంలోని ప్రత్యేకత. ఇది కేవలం ఆటల ప్రాంగణమే కాదు.. ఆరోగ్యానికి, స్నేహానికి, సామాజిక సంబంధాలకు వేదికగా నిలుస్తోంది.

మార్నింగ్ ఫ్రెండ్స్'తో మధురానుభూతి

నా ఆలోచనలు ఇలా సాగుతుండగా, హుజూరాబాద్ మున్సిపల్ కౌన్సిలర్, మిత్రుడు వర్ధినేని రవీందర్ రావు తన మిత్రబృందం వద్దకు రావాలని ఆహ్వానించారు. దీంతో హనుమాన్ దేవస్థానం చైర్మన్ కొలిపాక శంకర్ బైక్‌పై అక్కడికి వెళ్లాను. వర్ధినేని రవీందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మార్నింగ్ ఫ్రెండ్స్' బృంద సభ్యులు ప్రతిరోజూ వాకింగ్ పూర్తయిన తర్వాత అక్కడే లెమన్ టీ సేవించి, సమూహ చిత్రాన్ని దిగుతారని ఆయన వివరించారు. ఆ మిత్రబృందంతో కలిసి నేను కూడా ఫొటో దిగాను. ఆ ఆత్మీయ క్షణాలు నా హుజూరాబాద్ పర్యటనలో మరో మధుర జ్ఞాపకంగా మిగిలిపోయాయి.

ఫొటోలోని మిత్రుల వివరాలు:

మొదటి వరుసలో ఎడమ నుంచి కుడికి: భాస్కర్, స్వామిరెడ్డి, కే. మల్లారెడ్డి, ధనవర్ష రాజు, బత్తుల సమ్మయ్య, బెదరకోట రవీందర్, వర్ధినేని రవీందర్ రావు, పూలమొక్కను స్వీకరిస్తున్న వ్యక్తి (పేరు తెలియదు), ఆవునూరి సమ్మయ్య, బండ శ్రీనివాస్, సోల్లు బాబు, డాక్టర్ సంగెం ఐలయ్య, చింత శ్రీనివాస్, సాయి, మండల యాదగిరి, పాక సతీష్, శ్రీనివాస్.రెండో వరుసలో ఎడమ నుంచి కుడికి: పైళ్ల వెంకటరెడ్డి, జె.కె. సత్యం, నీరటి రమేష్, బెదరకోట శ్రీనివాస్, రావుల లింగారెడ్డి, ఎంపటి సతీష్, కొలిపాక శంకర్, పల్కల ఈశ్వర్ రెడ్డి, రవీందర్. ఈ మిత్రబృందంతో గడిపిన క్షణాలు పాత జ్ఞాపకాలను మరోసారి నెమరువేసుకునే అవకాశాన్ని కల్పించాయి. వయసు పెరిగినా, కాలం గడిచినా మిత్రుల మధ్య ఆత్మీయత మాత్రం చెక్కుచెదరలేదనే భావన కలిగింది.

సామాజిక ఉద్యమ సహచరులతో ఆత్మీయ భేటీలు

ఈ పర్యటనలో క్రీడామైదాన జ్ఞాపకాలతో పాటు సామాజిక ఉద్యమాలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కూడా లభించింది. ఈ నెల 11వ తేదీన హుజూరాబాద్ పట్టణంలో నిర్వహించిన మానవ హక్కుల వేదిక యోధుడు డాక్టర్ బాలగోపాల్ సంస్మరణ సభలో పాల్గొని ప్రసంగించాను. అనంతరం మిత్రుడు మురికి శివదయాల్‌తో కలిసి హనుమకొండకు వెళ్లి ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్‌ను కలిశాను. అదే రోజు తిరిగి హుజూరాబాద్ చేరుకున్నాను.

మరుసటి రోజు, అంటే 12వ తేదీన,

హుజూరాబాద్‌లో సామాజిక ఉద్యమ నాయకుడు భీమోజు సదానందం, సైదాపూర్ మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకటరాజం, డీటీఎఫ్ నాయకుడు పల్కల ఈశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు మిత్రులతో కలిసి మాట్లాడాను. 13వ తేదీన మిత్రుడు భీమోజు సదానందం నన్ను హుజూరాబాద్ బస్టాండ్‌లో కరీంనగర్‌కు సాగనంపారు. కరీంనగర్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మిత్రుడు నెల్లుట్ల వాసుదేవరావు, 'జీవగడ్డ' సంపాదకుడు, దివంగత బి. విజయకుమార్ సహచరి సబిత విజయకుమార్‌లతో మాట్లాడిన అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరాను.

ఈ భేటీలన్నీ పాత అనుబంధాలను పునరుద్ధరించుకోవడంతో పాటు సామాజిక ఉద్యమాల జ్ఞాపకాలను నెమరువేసుకునేందుకు దోహదపడ్డాయి.

మిత్రుల అనుబంధమే జీవితానికి అసలైన సంపద

ఈసారి స్వగ్రామ పర్యటనలో అనేకమంది పాత మిత్రులను కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఒక్కొక్కరితో గడిపిన క్షణాలు, వారు పలకరించిన తీరు, పంచుకున్న అనుభవాలు మనసుకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి.జీవిత ప్రయాణంలో కాలం గడుస్తుంది. తరాలు మారుతాయి. మనుషులు వివిధ ప్రాంతాలకు వెళ్లిపోతారు. అయినప్పటికీ బాల్యం నుంచి ఏర్పడిన అనుబంధాలు, కలిసి నడిచిన సామాజిక ఉద్యమాల జ్ఞాపకాలు, మిత్రులతో పెనవేసుకున్న మానవీయ సంబంధాలు మాత్రం మనసులో శాశ్వతంగా నిలిచిపోతాయి.హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానం నాకు అలాంటి ఎన్నో జ్ఞాపకాలను అందించింది. అది నా బాల్యానికి సాక్ష్యం. నా మిత్రబృందానికి చిరునామా. క్రీడాకారుల ఎదుగుదలకు వేదిక. సామాజిక చైతన్యానికి ఆలవాలం. ఈ మైదానం ఇలాగే ఎందరికో స్ఫూర్తినిస్తూ, ఆరోగ్యానికి, స్నేహానికి, క్రీడా ప్రతిభకు, మానవీయ సంబంధాలకు కేంద్రంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.మిత్రులారా.. మీ ఆత్మీయ అనుబంధం ఇలాగే కొనసాగాలని, ఎల్లప్పుడూ కొనసాగుతుందని విశ్వసిస్తూ.. మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

అనంతసాగర్‌లో 'సంఘమిత్ర' అవగాహన కార్యక్రమం

- మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళా భద్రతపై అవగాహన కల్పించిన ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్



హసన్‌పర్తి, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ): వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు 'సంఘమిత్ర' (కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్)లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ పాల్గొని మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేర రహిత, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, మహిళా సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో భద్రతను పెంపొందించేందుకు కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. మహిళలు, బాలల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సమన్వయాన్ని పెంపొందించి సురక్షిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, పోలీస్ సిబ్బంది, మండల స్థాయి మహిళా సమైక్య ప్రతినిధులు, ఏపీఎం నారాయణ, సీసీ పద్మ, వీఏఓ రజిత, గ్రామ మహిళా సమైక్య సంఘ అధ్యక్షులు, కోశాధికారి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.





సందేశకర్తలకు సకాలంలో జీతాలు ఇవ్వాలి

టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు గుండు సురేందర్ డిమాండ్

కేసముద్రం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : మహబూబాబాద్ జిల్లా పరిధిలోని 10 మండలాల విద్యా వనరుల కేంద్రాల్లో పనిచేస్తున్న సందేశకర్తలకు గత మూడు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టిపిటిఎఫ్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ ప్రభుత్వాన్ని, విద్యాశాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 10 మండలాల్లో సందేశకర్తలు గత కొన్ని సంవత్సరాలుగా ఏజెన్సీల ద్వారా వేతనాలు పొందుతున్నారని, ఈ విధానం వల్ల జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత ఏజెన్సీల మధ్య సమన్వ యలోపం కారణంగా సకాలంలో వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ విడుదల కాలేదనే కారణంతో వేతనాలు చెల్లించకపోవడం వల్ల మూడు నెలలుగా జీతాలు లేక సందేశకర్తలు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి మిగతా ఉద్యోగుల మాదిరిగానే సమగ్ర శిక్షా నుంచే నేరుగా వేతనాలు చెల్లించాలని ప్రధాన కార్యదర్శి నరసింహరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జెన్‌కో డీఈకి పరామర్శ



గణపురం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : గణపురం మండలంలోని చెల్పూర్ కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (జెన్‌కో) డీఈ పుట్ట తిరుపతి తండ్రి పుట్ట రాజయ్య మృతిచెందగా బుధవారం సోషల్ జస్టిస్ ఫోరం, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్ వారి స్వగ్రామమైన గోరికొత్తపల్లికి వెళ్లి నివాళులర్పించారు. రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పుట్ట తిరుపతి కుటుంబ సభ్యుల ను పరామర్శించి, రాజయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోరికొత్తపల్లి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పుట్టా రవి ముదిరాజ్, తిరుమలగిరి మాజీ ఎంపీటీసీ గంట గోపాల్ ముదిరాజ్, కుల పెద్దలు పుట్ట శంకర్ ముదిరాజ్, ఆర్ఎంపీ డాక్టర్ రాంబాబు ముదిరాజ్, ఐలయ్య పాల్గొన్నారు.

ముళ్ల కంపలు తొలగించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి జల్లే జయరాజ్



కేసముద్రం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో నల్లాల బావి వైపు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంపలు అడ్డంగా పెరగడం వల్ల స్థానిక ప్రజలు, రైతులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని సిపిఎం పట్టణ కార్యదర్శి జల్లే జయరాజ్ అన్నారు.ఎన్టీఆర్ నగర్ వైపు నుండి కేసముద్రం స్టేషన్ కు, తాగునీటి అవసరాలు తీర్చే నల్లాల బావుల వద్దకు మున్సిపాలిటీ సిబ్బంది నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని, అదే విధంగా కేసముద్రం గ్రామం, చైతన్య నగర్ నుండి మార్కెట్ వైపు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంపలను తొలగించాలని కోరారు.అదే విధంగా నల్లాల బావి వైపు నివాసం ఉంటున్న ప్రజల సౌకర్యార్థం విద్యుత్ స్తంభాలు నాటి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా ఇవ్వలేదని, వెంటనే సంబంధిత గుత్తేదారు, అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా ఇచ్చి, స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ సభ్యులు వల్లపు సారయ్య, రాజేష్, సాయి రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మీ అలంకారంలో భద్రకాళి మాత



మట్టెవాడ, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : కాకతీయుల రాజధాని ఏకశిలా నగరంగా చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానం లో దేవీ శరన్నవరాత్ర మహాటరీత్సవాలు బుధవారంతో నాల్గవ రోజుకు చేరుకున్నా యి. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం నిర్వర్తించి న పిమ్మట అమ్మవారిని మహాలక్ష్మిగా అలంక రించి పూజారాధనలు జరిపారు. మంత్ర దీక్ష తీసుకొని సాధకుడు మంత్రానుష్ఠానం చేస్తుం డగా అమ్మవారు ధనమూలమిదం జగత్ అని కదా అందుకోసం సాధకుడి అనుష్ఠానం పట్ల ప్రసన్నమైన అమ్మవారు సాధకుడికి అమితమై న ఐశ్వర్యాన్నిస్తుంది అనటానికి సంకేతంగా అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించడంలోని నేపధ్యం. నవరాత్రులలో మహాలక్ష్మి రూపం లోని దర్శించిన భక్తులకు అఖండలక్ష్మి ప్రాప్తి కలిగిస్తుంది. నవదుర్గా కల్పోక్త నవరాత్ర పూజా విధానాన్ని అనుసరించి అమ్మవారిని కూష్మాండీ, గిరిజ క్రమాలలో పూజారాధనలు జరిపారు. ఈరోజు సాధకుని మనస్సు అనాహ త చక్రం నందు స్థిరమౌతుంది. కావున ఈ దినమున సాధకుడు మిక్కిలి పవిత్రమైన మనస్సుతో కూష్మాండాదేవి స్వరూపాన్ని ధ్యానిస్తూ పూజలు జరపాలి. తద్వారా అమ్మవారు భక్తుడి ఉపాసనకు పరితృప్తయై అసురీ శక్తులను భక్తుల నుండి దూరం చేస్తుంది. గిరిజా క్రమంలో ఆరాధింపబడిన అమ్మవారు సాధకులకు సకల సౌభాగ్యాలు ప్రాప్తింప జేస్తుంది. ఈ రోజు అమ్మవారిని ఉదయం నూర్యప్రభ వాహనం మీద సాయంకాలం హంస వాహనం మీద ఊరేగింపు జరిపారు. ఉదయం నూర్యప్రభ వాహనం మీద సావిత్రిగా అలంకరించి సాయంకాలం హంస వాహనంపై బ్రాహ్మీమాత గా అలంకరించి ఊరేగించారు. సూర్యప్రభ వాహనం మీద సావిత్రి మాతగా ఊరేగుతున్న అమ్మవారిని దర్శించిన వారికి ధర్మశ్రద్ధ ఏర్పడుతుంది. యతో ధర్మ స్థతో జయ అని కదా శాస్త్ర వచనం. ధర్మాన్ని నమ్ముకున్నవాడు విజయం సాధిస్తాడు. అట్లాగే హంస వాహనం మీద బ్రహ్మీమాతగా ఊరేగుతున్న అమ్మవారిని దర్శించడం వలన మేధాశక్తి కలిగి ఉంటాడు. మంచి, చెడు విచక్షణ కలిగి ఉంటాడని ఆల య ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపా రు. ఈ రోజు కార్యక్రమాలకు గండ్ర భూపాల్ రెడ్డి-రూపా దంపతులు,ఎగండ్ర అభిలాష్ రెడ్డి-దివ్య దంపతులు, గండ్ర సాయికృష్ణారెడ్డి-భావనాంజలి దంపతులు, అనసూరి శ్రీనివాస్-బాలజనని దంపతులు, అట్టం శంతన్ పటేల్- శ్రీగంధ దంపతులు, ముప్పిడి సుధీర్ రెడ్డి- అర్పిత తదితరులు ఉభయదాత లుగా వ్యవహరించారు. పూజానంతరం ఉభయదాతలకు శేషవస్త్రములు బహుకరించి ప్రసాదాలు అందచేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక క్యూలైన్లు, మంచినీటి సౌకర్యం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను ఆలయ ఈ.ఓ రామల సునీత పర్యవేక్షించారు. దేవాలయాన్ని సందర్శించిన భక్తులందరికీ భద్రకాళీ సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం, రాత్రి అశేష అన్నదానం నిర్వహించారు. ఈరో జు అమ్మవారిని తొగుట పీఠాధీశ్వరులు మాధవానంద నరస్వతీ స్వామివారు ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన స్వామివారికి ఆలయ ఈఓ, ప్రధానా ర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికా రు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ మహామండపంలో భక్తులనుద్దేశించి తమ అనుగ్రహ భాషణం తెలిపారు. అనంత రం దేవాలయంలో తయారు చేయబడుచున్న నూతన రథాన్ని పరిశీలించారు. సాయంకాలం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి.



జనగణన నిర్వహణలో ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలి

జేడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

మట్టెవాడ, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : జనగణన--2027లో భాగంగా చేపట్టనున్న రెండో దశ జనాభా గణన ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు ప్రతి ఉద్యోగి పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిం చాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న సూచించారు. హనుమకొండ జిల్లా జేడబ్ల్యూఎంసీ పరిధిలోని ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు రెండు రోజులు జేడబ్ల్యూఎంసీ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన జనగణన--2027 రెండో దశ జనాభా గణన శిక్షణ కార్యక్రమంలో చివరి రోజైన బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జనాభా గణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు కీలకమైన సమాచారాన్ని అందించే అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ అని అన్నారు. ప్రజల సంక్షేమం, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు జనగణన గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందువల్ల శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయి లో సమర్థవంతంగా అమలు చేస్తూ, జనాభా గణనకు సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా మొదటి దశలో చేపట్టిన హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్.ఎల్.ఓ) ద్వారా రూపొందించిన హౌస్ లిస్టింగ్ బ్లాకులను రెండో దశలో జనాభా గణన కోసం అవసరమైన ఎన్యుమరేషన్ బ్లాకులుగా రూపొందించే ప్రక్రియపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సంబంధిత ప్రశ్నావళి, విధివిధానాలు, సాంకేతిక అంశాలపై స్పష్టతతో పనిచేయాలని సూచించారు. జనగణన విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుం డా, నిర్దిష్ట మార్గదర్శకాలను అనుసరిస్తూ సమన్వయం తో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రవీందర్ రాడెకర్, హైదరాబాద్ జనగణన విభాగానికి చెందిన శిక్షకులు సతీష్, ప్రశాంత్ తదితరులు పాల్గొని జనాభా గణనకు సంబంధించిన విధివిధానాలు, సాంకేతిక అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.



బతుకమ్మ వేడుకల్లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత నివాసంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో రాష్ట్ర బిఆర్ఎస్ మహిళ నేతలతో కలిసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పారు. మహిళలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు



కొత్తగట్టు క్రషర్ల అనుమతులు రద్దు చేయాలి

లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన పర్యావరణ ప్రేమికుడు ఆజాద్

హనుమకొండ, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు గ్రామంలో ప్రభు త్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహి స్తున్న క్రషర్లను రద్దు చేయాలని కోరు తూ పర్యావరణ ప్రేమికుడు, సామాజిక నాయకుడు ఓయూ నేత ఆజాద్ స్థానిక నాయకులు సావడి అప్పారావు లోకా యుక్త ముందు వాపోయారు. ఈవిష యమై అధికారులకు పలుమార్లు ఫిర్యా దు చేసినా అధికారులు క్రషర్ యజ మానులకు కొమ్ముకాస్తున్నారని తెలిపారు. క్రషర్లు ఊరికి దగ్గరనే ఉండడం వల్ల గ్రామ ప్రజలం దరూ అనారోగ్య సమస్యల గురైన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని యజమానులు క్రషర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా బోరు బ్లాస్టింగ్ చేసి విధ్వంసం సృష్టిస్తుంటే అధికారు లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిం చారు. ఇప్పటికైనా క్రషర్ యజమానులు సృష్టించే విధ్వంసం నుండి గ్రామాన్ని, గ్రామ ప్రజలను కాపాడాలని కోరారు.



విద్యుత్ ఉపకేంద్రం పనులు వేగవంతం చేయాలి

అభివృద్ధి పనులను పరిశీలించిన మార్కెట్ చైర్మన్ సంజీవ రెడ్డి



కేసముద్రం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పనులను విద్యుత్ శాఖ ఉన్నతాధికారు లు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యవేక్షక ఇంజనీరు దర్శన్ కుమార్, విభాగ ఇంజనీరు డి.కోటేశ్వరరావు ఉపకేంద్రం వద్దకు చేరుకొని నిర్మాణ పనుల పురోగతిని సమగ్రం గా పరిశీలించారు. ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, స్తంభాల నిర్మాణం, లైన్ల పనుల గురించి సహాయ ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఉపకేంద్రం అందుబాటు లోకి వస్తే కేసముద్రం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తొలగిపోయి, రైతులకు వ్యవసాయానికి, ప్రజలకు గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందుతుందని అధికారులు తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో గంటా సంజీవరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం నాగేశ్వరరావు, నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, బండారు దయాకర్ పాల్గొన్నారు. ఉపకేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.వారి వెంట సహాయ విభాగ ఇంజనీరు ఐలయ్య, నిర్మాణ విభాగ సహాయ ఇంజనీరు బి.వి. రమణ, నిర్వహణ విభాగ సహాయ ఇంజనీరు రాజు తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : స్థానిక సమతా పాఠశాల ఆవరణంలో మంగళ వారం అంబేద్కర్ యువజన సంఘం కేసముద్రం మున్సిపాలిటీ నూతన కమిటీ ఎన్నిక వేల్పు గొండ ఏలియా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలేపాక ఉప్పలయ్య హాజరయ్యారు. నూతన కమిటీ అధ్యక్షులుగా సోమారపు మదర్, ఉపాధ్యక్షులుగా వేల్పుగొండ ఏలియా, ప్రధాన కార్యదర్శిగా జల్లంపల్లి శ్రీకాంత్, కోశాధికారిగా చింతకుంట్ల రవి, సహాయ కార్యదర్శులుగా బంటు మహేష్, ఈదుల వెంకటేష్, అధికార ప్రతినిధిగా పెండ్యాల రవికుమా ర్, సామాజిక మాధ్యమ ప్రతినిధిగా గద్దల యాకస్వామి ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారు లుగా బిర్రు వెంకన్న, మంద సాయిబాబా, దండు శ్రీనివాస్, కంటిపూడి అరుణ్ కుమార్, బిక్షం, చింతకుంట్ల వెంకన్న, పందుల సారయ్య, కొంగర రామ్మూర్తి, జలంపల్లి సుధాకర్, జన్ను కట్టయ్య, చారి అభిషేక్, మిట్ట గడుపుల జలంధర్, కొమ్ము భాస్కర్‌లను నియమించారు.



బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

చెరువుల వద్ద పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి - బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన జిడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

మట్టెవాడ, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : బతుకమ్మ పండుగను మహిళలు, ప్రజలు ఆనందోత్సాహాలతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణం లో జరుపుకునేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సు, బెస్తం చెరువు, బంధం చెరువు, పద్మాక్షిగుండం చెరువు తదితర ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకల కోసం చేపడుతున్న ఏర్పాట్లను కమిషనర్ క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సమర్థవం తంగా నిర్వహించుటకు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. చెరువుల వద్దకు బతుకమ్మలను తీసుకువచ్చే మహిళలు, భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మౌలిక సదుపా యాలు కల్పించాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎప్పట కప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసర మైన చోట్ల మార్గాలను సరిచేయడంతోపాటు, రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువుల వద్ద ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని, సంబంధిత శాఖల అధికారులను సమన్వ యం చేసుకొంటూ అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని, అన్ని ఏర్పాట్లను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిం చాలని స్పష్టం చేశారు. వివిధ విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ బతుకమ్మ వేడుకలు విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించ డంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని, చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసి వేడుకలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు సంజయ్ కుమార్, రవికుమార్, సంబంధిత విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో కూలిన సీలింగ్!

తృటిలో తప్పిన పెను ప్రమాదం - కుర్చీ, టేబుల్‌పై పడిన శిథిలాలు - శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు





భూపాలపల్లి, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం పెను ప్రమాదం తృటిలో తప్పింది. తహసీల్దార్ విధులు నిర్వహించే ప్రధాన ఛాంబర్‌లో పైకప్పు ఒక్కసారిగా కూలిపడింది. సీలింగ్ పెచ్చులతోపాటు ఫ్యాన్ కిందపడటంతో కంప్యూటర్లు ధ్వంసమయ్యాయి. అయితే ఘటన జరిగిన సమయంలో గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. బుధవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది గది తలుపులు తెరిచి చూడగా పైకప్పు కూలిన దృశ్యం కనిపించింది. తహసీల్దార్ కూర్చునే కుర్చీ, టేబుల్‌పై సీలింగ్ శిథిలాలు పడటంతో సిబ్బంది ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. కార్యాలయ సమయాల్లో ఈ ఘటన జరిగి ఉంటే భారీ ప్రాణనష్టం సంభవించి ఉండేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

తహసీల్దార్ కార్యాలయ భవనంలో పలుచోట్ల పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండటంతో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు, పనుల కోసం వచ్చే ప్రజలకు కనీస భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే భవనాల స్థితిగతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయానికి తక్షణ మరమ్మతులు చేపట్టడంతోపాటు మండలంలోని ఇతర ప్రభుత్వ భవనాల భద్రతపై సమగ్ర పరిశీలన నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రామప్ప నీటి పనుల్లో జాప్యం వద్దు

అధికారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాలు - జాప్యం చేస్తే చర్యలు తప్పవు కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక

భూపాలపల్లి, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : బుద్దారం గ్రామంలో భూసేకరణకు సంబంధించి ప్రతిపాదించిన భూసేకరణ ప్రక్రియ చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీలో రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భూసేకరణ, పెగ్ మార్కింగ్, సర్వే పనులపై కలెక్టర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బుద్దారం గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియలో భాగంగా సర్వేయర్ల సహకారంతో క్షేత్రస్థాయిలో అలైన్‌మెంట్‌ను స్పష్టంగా గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు



సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. రామప్ప నుంచి నీటిని తరలించే ప్రతిపాదనలపై సమీక్షించి ఈ ప్రాజెక్టు ద్వారా ఎనిమిది మండలాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించి, పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి, పెండింగ్‌లో ఉన్న ప్రక్రియలు, టెండర్లు, ఇతర పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రాజెక్టుల అమలులో జాప్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ... 15వ తేదీ గురువారం వరకు ఇరిగేషన్ అధికారులు భూ సేకరణ అవసరమైన మేరకు పెగ్ మార్కింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. పెగ్ మార్కింగ్, రీ సర్వే పనులను ఆర్డిఓ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ముఖ్యమైన సమావేశానికి అనుమతి లేకుండా గైర్హాజరైన గన్‌పూర్ సబ్ డివిజన్ డిఈ సదయ్యకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఎండీఓ

కరకగూడెం, అక్టోబర్ 14,(పీపుల్స్ డైరీ) : తాటిగూడెం గ్రామపంచాయతీలో బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తగా (ఎంపీడబ్ల్యూ) పనిచేస్తున్న దొడ్డి సూర్యం కుమార్తె ఇటీవల అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడంతో, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన దశదిన కర్మల సందర్భంగా బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. అలాగే కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి, దశదిన కర్మలకు బియ్యం అందజేయడంతో పాటు ఆర్థిక సహాయం చేసిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.





రోడ్డు పక్కనే గోతులు...

పెంటన్నగూడెం గ్రామస్తులు, వాహనదారుల ఇబ్బందులు

పినపాక, అక్టోబర్ 14(పీపుల్స్ డైరీ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని పెంటన్నగూడెం గ్రామంలో ప్రధాన సీసీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ లేకపోవడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో రహదారి పక్కన లోతైన గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో రహదారి వెంబటి సుమారు మీటరు లోతుతో గోతులు కనిపిస్తున్నాయి అంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

వరి కోతల వేళ మరింత ప్రమాదం...!

మరో 20 రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామంలోకి ధాన్యం లోడింగ్ కోసం లారీలు రాకపోకలు సాగించనున్నాయి. రహదారి పక్కన గ్రావెల్ లేకపోవడంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో సీసీ రోడ్డు అంచులు దెబ్బతిని, రోడ్డు పగుళ్లు ఏర్పడి ముక్కలయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ సర్పంచ్ సనప అనిత స్పందించి, సీసీ రోడ్డుకు ఇరువైపులా తక్షణమే గ్రావెల్ పోయించి, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో రహదారి సమస్య రైతులకు అదనపు ఇబ్బందిగా మారకముందే అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యను త్వరలోనే పరిష్కరిస్తా : సర్పంచ్ సనప అనిత



పెంటన్నగూడెం గ్రామంలో రహదారికి ఇరువైపులా గ్రావెల్ లేకపోవడంతో గ్రామస్తులు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్య మా దృష్టికి వచ్చింది. త్వరలో అధికారుల సహకారంతో గ్రావెల్ పోయించి సమస్య పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తానని తెలిపారు. ఇవే కాకుండా గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను కూడా తన దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.



సద్దుల బతుకమ్మ వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలించిన సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్

గణపురం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : గణపురం మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ సంత వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. వేడుకలకు హాజరయ్యే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచ్ పేర్కొన్నారు. వేడుకల నిర్వహణలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పంచాయతీ కార్యదర్శి ఉమ్మల్ల విజేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వండి

ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌కు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ వినతి



న్యూఢిల్లీ, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం వస్తే పేదలకు ఎక్కువ సేవ చేయాలనే ఆలోచనతో కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్‌ను ఆయన కలిసి తన అభ్యర్థనను తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో తన ప్రస్థానం, విద్యార్థి దశ నుండి పార్టీ కోసం చేసిన సేవలు, ఎస్సీ ఎస్టీ బీసీ వివిధ ప్రజాసంఘాలు విలేకరుల సమావేశాల ద్వారా రామకృష్ణకు ఎంఎల్సీ విజ్ఞప్తులను కేసీ వేణుగోపాల్‌కు అందజేశారు.

అధిష్టానంపై సంపూర్ణ విశ్వాసం

కాంగ్రెస్ అధిష్టానంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులను నాయకత్వం తప్పకుండా గుర్తిస్తుందన్న విశ్వాసం ఉందని కాంగ్రెస్ నేత డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. పార్టీ కోసం చేసిన సేవలను, తన రాజకీయ ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

పార్టీ సేవలకు గుర్తింపు దక్కుతుందనే ఆశ

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు నిరంతరం కృషి చేస్తున్న నాయకులకు తగిన గుర్తింపు గుర్తింపు ఇస్తుందనే తన ఆకాంక్ష అని రామకృష్ణ పేర్కొన్నారు. పదవులు బాధ్యతతో కూడినవని, అవకాశం లభిస్తే ప్రజాసేవకు మరింత విస్తృతంగా కృషి చేయవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

దుగ్గొండి మండలం కేశవపురం గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

మహిళా సంఘాల భవనానికి రూ.10 లక్షలు

గ్రామపంచాయతీ భవనానికి రూ.20 లక్షలతో శంకుస్థాపన

నర్సంపేట, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : దుగ్గొండి మండలం కేశవపురం గ్రామంలో మహిళా సంఘాల భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మహిళల ఆర్థిక స్వావలంబనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి, వారి ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి, కుటుంబాలకు అండగా నిలబడటంతో పాటు సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ,5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.



మహిళా సంఘాల బలోపేతమే గ్రామీణ అభివృద్ధికి పునాది

మహిళా సంఘాల భవనాల నిర్మాణం ద్వారా మహిళలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను సమర్థవంతంగా కొనసాగించడానికి మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ మందపల్లి, మహమ్మదాపురం పిఎసిఎస్ చైర్మన్ ఇంగోలి రాజేశ్వరరావు ,నాచినపల్లి పిఎసిఎస్ చైర్మన్ చెన్నూరి కిరణ్ రెడ్డి, దుగ్గొండి పిఎసిఎస్ చైర్మన్, దుగ్గొండి పిఎసిఎస్ చైర్మన్ ముత్యాల కుమారస్వామి, తాహసిల్దార్ ముసుకు సమ్మక్క , ఎంపీడీవో లెక్కల అరుంధతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుక్క రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు సమస్యలపై మాజీ ఎమ్మెల్యే సమరశంఖం!

మణుగూరు అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : మణుగూరు పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. గుంతలమయంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, ఇసుక లారీలు, సింగరేణి లారీల అధిక వేగాన్ని నియంత్రించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని, దుమ్ము ధూళి కాలుష్యం నుంచి మణుగూరు ప్రజలకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన మెరుపు ధర్నాలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. రేగా కాంతారావు పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజా సమస్యలపై తమ నిరసన గళాన్ని వినిపించారు.

గుంతలమయమైన రహదారులు.. ప్రజలకు తప్పని తిప్పలు!

మణుగూరు పట్టణంలో రహదారుల పరిస్థితి, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రధాన చర్చనీయాంశంగా మారాయి. రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో నూతన రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఇసుక, సింగరేణి లారీల వేగానికి అడ్డుకట్ట వేయాలి!

మణుగూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక లారీలు, సింగరేణి భారీ వాహనాల రాకపోకలపై తగిన పర్యవేక్షణ ఉండాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరాయి. భారీ వాహనాల అధిక వేగం వల్ల ప్రజలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశాయి. రహదారులపై వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ప్రజలు, వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పటిష్టం చేయాలని, ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరాయి.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరుబాట!

మణుగూరు ప్రజలు ఎదుర్కొంటున్న రహదారుల దుస్థితి, భారీ వాహనాల వేగం, దుమ్ము ధూళి కాలుష్య సమస్యలకు పరిష్కారం లభించే వరకు అధికారులు నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు సురక్షితమైన రహదారులు, ప్రమాదరహిత ప్రయాణం, మెరుగైన పర్యావరణ పరిస్థితులు కల్పించడం అధికార యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు. రేగా కాంతారావు స్వయంగా పాల్గొన్న ఈ మెరుపు ధర్నాతో మణుగూరులో నెలకొన్న ప్రజా సమస్యలు మరోసారి చర్చకు వచ్చాయి. ప్రజల ఇబ్బందులను సంబంధిత అధికారులు గుర్తించి, తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
గురువారం, 15 అక్టోబర్ 2026
సంపుటి : 18, సంచిక : 207

సర్ నోటీసుల పంపిణీ, విచారణలను వేగంగా పూర్తి చేయాలి

ఎస్ఐఆర్ 2026, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ కార్యక్రమం, ఎమ్మెల్సీ ఓటరు జాబితా నమోదుపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,630 నోటీసుల పంపిణీ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని 99.07 శాతం నోటీసుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. 1,58,144 మందికి విచారణ పూర్తి చేశామని వెల్లడించారు. మిగిలిన విచారణలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని, ఓటర్ల నుంచి స్వీకరించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఫారం-6 దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలి

జిల్లాలో ఫారం-6కు సంబంధించి మొత్తం 6,435 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి పరిష్కారంపై ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి వచ్చే వారంలోగా పరిష్కరించాలని



స్పష్టం చేశారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ లో ఇప్పటివరకు జిల్లాలో సుమారు 27 వేల మంది నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. గతంలో 84 వేల మంది ఓటర్లుగా నమోదయ్యా రని పేర్కొన్నారు. ఈసారి కనీసం 2 లక్షల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. నవం బర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారు లకు సూచించారు. నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అన్నారు.

మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబం ధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, నమోదు ప్రక్రియపై సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ ఛానళ్ల ద్వారా విస్తృ తంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ.రాజు, డిటి అన్సారీ, భారత రాష్ట్ర సమితి ప్రతినిధులు బి. వేణుగోపాల్, ఎం. రమేష్, ఏ.సతీష్ బాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, సీపీఎం పార్టీ ప్రతినిధి ఆర్.ప్రకాష్ తదితరులున్నారు.



పింఛన్ల దరఖాస్తులను పరిశీలించిన డిపిఓ

ఏన్కూరు, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : మండల పరిధిలోని నూకాలంపాడు,ఆరికాయలపాడు , మేడేపల్లి గ్రామాలలో జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) వినోద్ కుమార్ పర్యటించి కొత్త పింఛన్ల దరఖాస్తులను పరిశీలించారు. సూపర్ చెక్ చేశారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అర్హతలను, కుటుంబ పరిస్థితులను పరిశీలించారు. అర్హులైన వారిని లబ్ధిదారులు గా గుర్తించేందుకుగాను మండల స్థాయి నుంచి, జిల్లా స్థాయి వరకు పలువురు అధికారులు ఈ కొత్త పింఛన్ల దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ భాగ్యశ్రీ, ఎంపిఓ ఎస్.కె ఖాదర్‌మియా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీజీజేఏ జిల్లా అధ్యక్షుడిగా సతీష్ ఎన్నిక హర్షణీయం

జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలి : రమణారెడ్డి

వెంకటాపూర్, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ములుగు జిల్లా అధ్యక్షుడిగా వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బేతి సతీష్ యాదవ్ ఎన్నిక కావడం హర్షణీయమని బీఆర్ఎస్ వెంకటాపూర్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్ లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మల్కా రమేష్ లు పాల్గొని టీజేఏ ములుగు జిల్లా అధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ.. వెంకటాపూర్ మండలానికి చెందిన వ్యక్తి జిల్లా స్థాయి జర్నలిస్ట్ సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వకారణమని, యూనియన్ నాయకుడిగా జర్నలిస్టుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మల్కా రమేష్ మాట్లాడుతూ వెంకటాపూర్ మండలానికి చెందిన సతీష్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా టీజేఏ ములుగు జిల్లా అధ్యక్షుడు బేతి సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ పేద రైతులకు సాగునీరు అందించాలి..!

టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు దమళ్ల సత్యం

ఖమ్మం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామంలోని పేద ఎస్సీ రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు దామాల సత్యం డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల ఏర్పాటుకు కేటాయించిన రూ.5 లక్షలను ఎస్సీ కార్పొరేషన్ నుంచి వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పేరుపల్లి గ్రామంలో సాగునీరు అందక వరి పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని దామాల సత్యం తెలిపారు. సకాలంలో సాగునీరు అందకపోతే పేద రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ఎస్సీ కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కి కూడా సమాచారం అందించినట్లు దామాల సత్యం తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి, మోటార్ల ఏర్పాటుకు అవసరమైన రూ.5 లక్షలను వెంటనే విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ సైతం చొరవ తీసుకొని లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా పేద ఎస్సీ రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వరి పంటలు ఎండిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించి, సాగునీటి సమస్యను పరిష్కరించి ఎస్సీ పేద రైతుల కుటుంబాలను ఆదుకోవాలని దామాల సత్యం విజ్ఞప్తి చేశారు.

ఎల్బీనగర్‌లో వైభవంగా అమ్మవారి పూజలు

ఖమ్మం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : నగరంలోని 8వ డివిజన్ ఎల్బీనగర్‌లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నా యి. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు అమ్మవారు భక్తులకు శ్రీ అన్నపూర్ణా దేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి భక్తి ప్రపత్తులతో 108 రకాల పిండివంట లు, ప్రసాదాలను నైవేద్యంగా సమ ర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమా ర్ ఆశీస్సులతో, బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం నగర మాజీ అధ్యక్షు డు దేవభక్తిని కిషోర్ బాబు సహకారం తో బిఆర్ఎస్ నాయకుడు వాంకుడో త్ సురేష్ నాయక్ దంపతులు ఈ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ తెలంగాణ ప్రజల సంక్షేమానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వం లోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని పేర్కొం టూ, మళ్లీ కేసీఆర్ ప్రజాపాలన రావా లని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపా రు. అనంతరం వారు భారీ అన్నదాన



కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పగడాల నాగరాజు, చిరుమామిళ్ల కిరణ్, దండ జ్యోతి రెడ్డి అయ్యప్ప రెడ్డి, వీరేందర్ గౌడ్, మాటేటి కిరణ్ కుమార్, మోరంపూడి సాయి, బొడ్డు వెంకటేశ్వర్లు, రెంటపల్లి రమేష్, వడనపు శ్రీనివాసరావు, రామకృష్ణ, అకేటి అర్జున్, గొల్లపూడి ఉపేందర్, తెలపురెడ్డి గోపిరెడ్డి, షైక్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవోఎస్ మహిళా విభాగం బతుకమ్మ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



ఖమ్మం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవోఎస్) రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు, టీజీవోఎస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ టీజీవో మహిళా అధ్యక్షులు జి.ఉషాశ్రీ, కార్యదర్శి పి.సుధారాణి ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఐడిఓసీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ దివాకర టిఎస్, డాక్టర్ పి.శ్రీజ, ఐఏఎస్(అడిషనల్ కలెక్టర్ ఫర్ లోకల్ బాడీస్) ముఖ్య అతిథులుగా బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడు తూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు, టీజీఓ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి మాట్లాడుతూ... తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి, పూల వైభవానికి ప్రతీకగా బతుకమ్మ పండుగని ఈ పండుగ విశిష్టతను చాటి చెప్పడంతో పాటు, మహిళా అధికారుల మధ్య సోదరభావం, ఐక్యత, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో టీజీవోఎస్ మహిళా విభాగం బతుకమ్మ సంబరాల ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీజీవోఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, మహిళ కార్యవర్గ సభ్యులు, గుడికందుల జ్యోతి డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, విజయ కుమారి ప్రిన్సిపల్ టిజిఓ రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు, ప్రమీల డిడబల్యూవో, రాధిక మున్సిపాలిటీ ఉద్యానశాఖ అధికారి, మాధవి జిల్లా ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్, కరుణ శ్రీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, నాగలక్ష్మి, మాధవి, కుసుమకుమారి, ఇందిరా, మాధవి, నాగమణి, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా గెజిటెడ్ అధికారులు, ఉద్యోగినులు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



టెక్నాలజీ యుగంలోనూ చీకట్లోనే నెల్లికుదురు బస్టాండ్..

నెల్లికుదురు, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా యువ నాయకులు వరిపల్లి అనిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్టాండ్‌కు పేరు బోర్డు కూడా సక్రమంగా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు బస్టాండ్‌ను సందర్శించిన ఆయన, వెంటనే మరుగుదొడ్లను పునరుద్ధరించి, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలపై అధికారులు స్పందించకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వరిపల్లి అనిల్ కుమార్ పేర్కొన్నారు.



కలువల నాగారంలో దారుణ హత్య

- రూ.80 వేల అప్పు కోసం యువకుడి హత్య, నిందితుడు అరెస్ట్



కరకగూడెం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం కలువల నాగారంలో ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో దారుణ హత్య జరిగింది.

ఘటన వివరాలు :

కలువల నాగారానికి చెందిన బాధావత్ విజయ అనే మహిళ ఈనెల 10న కరకగూడెం పోలీస్ స్టేషన్‌కు వచ్చి, తన కొడుకు బాధావత్ రవిచంద్రను కరకగూడెంకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్ అనే వ్యక్తి ఆర్థిక లావాదేవీల కారణంగా కలువల నాగారం శివారులో చంపేశాడని ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

హత్యకు కారణం :

విచారణలో మృతుడు రవిచంద్ర నిందితుడు ఇమ్రాన్‌కు రూ.80,000 అప్పుగా ఇచ్చినట్లు తేలింది. ఈ బాకీ విషయంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ది.11-10-2026న రాత్రి 9:30 గంటల ప్రాంతంలో పథకం ప్రకారం ఇమ్రాన్ రవిచంద్రను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని కలువల నాగారం శివారులోకి తీసుకెళ్లి, దాడి చేసి మెడపై బెల్టుతో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం నిందితుడు ఇమ్రాన్‌ను అతని ఇంటి వద్ద అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన మోటార్ సైకిల్ మరియు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

వైరా పట్టణంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి పర్యటించిన కలెక్టర్

ఖమ్మం, అక్టోబర్ 14 (పీపుల్స్ డైరీ) : వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వైరా మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారు లను ఆదేశించారు.నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంపై కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యాన్ని నివారించి, నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం రింగ్ రోడ్డు సెంట్రల్ నుంచి వైరా రిజర్వాయర్‌కు వెళ్లే రహదారిని కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ గుట్టపై పర్యాటక అభివృద్ధికి, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు



చేసిన నేపథ్యంలో పనులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశిం చారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో కొనసాగు తున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044, e-mail : peoplesdairydaily@gmail.com

ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో

వెలిచాల రాజేందర్‌రావు భేటీ

కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ ■ వివిధ అంశాలపై చర్చించిన వెలిచాల రాజేందర్ రావు





పీపుల్స్‌డైరీ-కరీంనగర్ : కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఢిల్లీలో బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, ఉత్తరప్రదేశ్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సహురాన్ పూర్ లోక్‌సభ సభ్యుడు ఇమ్రాన్ మసూద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరిస్తున్న కార్యాచరణ గురించి మల్లికార్జున ఖర్గే కు రాజేందర్‌రావు వివరించారు.

కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం క్షేత్రస్థాయిలో చేపట్టిన కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ నిర్వహించిన అంశాల గురించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు వివరించారు.

అదేవిధంగా కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించేందుకు కృషి చేశానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

పార్టీ శ్రేణులకు నిరంతరం అందుబాటులో..

కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని రాజేందర్‌రావు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు..

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన పేదలకు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేందర్‌రావు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నామని మల్లికార్జున ఖర్గేకు వివరించారు.

డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ఎనిమిది నెలలైనా మేయర్ పాలకవర్గం నిర్లక్ష్యం..
- ఢిల్లీ నుంచి ఆర్మీ జవాన్ ఆవేదన..
- బతుకమ్మలతో మహిళల నిరసన పట్టదా..?
- డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్ డిమాండ్



పీపుల్స్‌డైరీ-కరీంనగర్ : కరీంనగర్ నగరంలోని డంపింగ్ యార్డు సమస్యపై పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్ డిమాండ్ చేశారు. బీజేపీ మేయర్, పాలకవర్గం బాధ్యతలు చేపట్టి ఎనిమిది నెలలు కావస్తున్నా ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్య పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చెత్త నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో పాలకులు తమ బాధ్యతను గుర్తించాలని సూచించారు.

ఢిల్లీ నుంచి ఆర్మీ జవాన్ ఆవేదన.. బతుకమ్మలతో నిరసన పట్టదా .?

డంపింగ్ యార్డు సమస్య తీవ్రతకు ఢిల్లీలో ఉన్న ఓ ఆర్మీ జవాన్ తన కుటుంబ సభ్యులు, పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేయడమే నిదర్శనమని రమేశ్ పేర్కొన్నారు. మరోవైపు, వివిధ కాలనీలకు చెందిన మహిళలు, స్థానికులు బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేయడం సమస్య తీవ్రతను తెలియజేస్తోందన్నారు. ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకోలేని పరిస్థితి నెలకొన్నా బిజెపి పాలకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

ఎనిమిది నెలలుగా ఏం చేస్తున్నారు?

బీజేపీ మేయర్, పాలకవర్గం అధికార పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా డంపింగ్ యార్డు సమస్యపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని రమేశ్ విమర్శించారు. ప్రజల ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వేసవిలో చెత్తకు మంటలు అంటుకుని దట్టమైన పొగ వ్యాపించడం, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడటం పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డు సమస్యపై ఇకనైనా నిర్లక్ష్యం వీడాలని అనంతుల రమేశ్ డిమాండ్ చేశారు. గత పాలకుల హామీలు నీటి మూటలుగా మిగిలాయని విమర్శించిన ఆయన, ప్రస్తుత బీజేపీ మేయర్, పాలకవర్గమైనా ప్రజల ఆవేదనను గుర్తించి డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనిలి స్పష్టం చేశారు.

కాశీబుగ్గ స్వధార్ హోమ్‌లో బాలికల హక్కులపై అవగాహన





పీపుల్స్‌డైరీ-వరంగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ , వరంగల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కాశీబుగ్గలోని స్వధార్ హోమ్‌లో బాలికలు, మహిళల హక్కులు, రక్షణ, విద్య, ఆరోగ్యం, సమానత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ ఆర్.సురేష్, స్వధార్ హోమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి కందుకూరి పూజ మాట్లాడుతూ, బాలికలు, మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి అన్యాయం, వేధింపులు లేదా వివక్షకు గురైనప్పుడు ధైర్యంగా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. బాలికల విద్య, భద్రత, స్వావలంబనకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హోంలో ఆశ్రయం పొందుతున్న మహిళలతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు.

అనంతరం స్వధార్ హోమ్‌లో బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటుతూ, మహిళలు, హోమ్ సిబ్బంది కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.

మహిళలు, బాలికల హక్కుల పరిరక్షణతో పాటు వారికి ఆత్మవిశ్వాసం, సామాజిక భద్రత కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.

బీమాతో ఆపద సమయాల్లో ధీమా

- డీఆర్‌డీవో శ్రీను
- గాయత్రి కో-ఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు ఖాతాదారుడికి రూ.లక్ష బీమా అందజేత

పీపుల్స్‌డైరీ-హనుమకొండ : ఆపద సమయాల్లో బాధిత కుటుంబానికి బీమాతో ఆర్థిక సాయం అందుతోందని డీఆర్‌డీవో శ్రీను సూచించారు. హనుమకొండలోని గాయత్రి కో-ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుడు హనుమకొండకు చెందిన కుంటమల్ల గణేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, అతడు ప్రమాద బీమా చేయించుకోగా పరిహారంగా రూ.లక్ష బీమా మంజూరైంది. కాగా నామినీ అయిన కుంటమల్ల స్వప్నకు ఆ చెక్కును బ్యాంకు ప్రతినిధులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో శ్రీను మాట్లాడారు. ఖాతాదారుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, గాయత్రి కో-ఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు అందిస్తున్న సేవలు, సామాజిక బాధ్యతను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మ్యాదరి సందీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎయిరిండియా విమానానికి హైజాక్ అలర్ట్..

జైపూర్‌కు అత్యవసరంగా మళ్లింపు

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి న్యూఢిల్లీకి వస్తున్న ఎయిరిండియా విమానానికి హైజాక్ హెచ్చరికలు రావడంతో అత్యవసరంగా జైపూర్‌కు దారిమళ్లించినట్టు ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ నివేదించింది. బోయింగ్ 787 ఏఐ-2030 విమానం జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. అనంతరం వివిధ భద్రతా సంస్థలకు చెందిన సిబ్బంది విమానంలోకి ప్రవేశించి విస్తృత తనిఖీలు చేపట్టారు. సాధారణంగా హైజాక్ వంటి సంఘటనలు జరిగినప్పుడు ఉపయోగించే అత్యున్నత స్థాయి భద్రతా ప్రోటోకాల్‌ను విమానాశ్రయ అధికారులు ఇక్కడ అమలు చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఢిల్లీకి దాదాపు 280 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజస్థాన్‌లోని జైపూర్ నగరంలో ఉదయం 9.45 గంటలకు విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ల్యాండింగ్ పూర్తయిన తర్వాత, అధికారులు విమానం వద్దకు చేరుకుని, ప్రయాణికులు కిందకు దిగడానికి నిచ్చెనలను ఏర్పాటు చేశారు. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ప్రయాణికులను, సిబ్బందిని కిందకు దిగేందుకు అనుమతించారు.

ప్రయాణికులకు రీషెడ్యూల్ సదుపాయాన్ని లేదా విమాన టికెట్ రద్దు చేసుకుంటే పూర్తి రీఫండ్ పొందే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఇటీవల దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో కో-పైలట్ కెప్టెన్‌పై దాడిచేసి, కూల్చివేయడానికి ప్రయత్నించిన ఘటన నేపథ్యంలో ఎయిరిండియా ఫ్లైట్‌లో హైజాక్ హెచ్చరికలు రావడం కలకలం రేపుతోంది.

కాగా, ప్రాథమిక విచారణ ప్రకారం.. విమానం ముంబయి ఫ్లైట్ ఇన్ఫర్మేషన్ రీజియన్ పరిధిలో ఉన్నప్పుడు, పైలట్ 'స్క్వాక్ కోడ్ 7500' (రానఝుఇఎ జశీఎవ 7500)ను యాక్టివేట్ చేశారు. ఇది విమానం హైజాకింగ్‌కు గురైందని లేదా చట్టవిరుద్ధమైన జోక్యానికి గురైందని సూచించే అంతర్జాతీయ ట్రాన్స్‌పాండర్ కోడ్. ఆ తర్వాత విమానాన్ని జైపూర్‌కు మళ్లించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. విమానంలో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనేది తక్షణమే తెలియరాలేదు. విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన తర్వాత, భద్రతా పర్యవేక్షణలో పైలట్లను, ప్రయాణికులను విడతల వారీగా కిందకు దించారు. ప్రస్తుతం ప్రయాణికులను, వారి లగేజీని భద్రతా తనిఖీలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

హైదరాబాద్‌లో ఇండియా కూటమి భారీ బహిరంగ సభ..?

- ఈనెల 24న లక్షమంది జనసమీకరణ
- త్వరలో వెలువడనున్న అధికారిక ప్రకటన

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : ఇండియా కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తోంది. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్), ఓట్ల తొలగింపు ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తూ చేపట్టనున్న ఉద్యమంలో భాగంగా ఈ సభను నిర్వహించాలని కూటమి నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 24వ తేదీన సభ నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. సుమారు లక్ష మందిని సమీకరించడమే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఏర్పాట్లపై దృష్టి సారిస్తోంది.

హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఈ సభకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఇండియా కూటమిలోని ఇతర జాతీయ స్థాయి నాయకులు హాజరయ్యే అవకాశం ఉందని హస్తం పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే నేతల హాజరు, సభా వేదిక, సమయం వంటి వివరాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌తో పాటు ఇతర అనువైన ప్రదేశాలను సభా వేదికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో రవాణా, భద్రత, వాహనాల పార్కింగ్, ఇతర ఏర్పాట్లపై పార్టీ నాయకత్వం దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగించకుండా చర్యలు తీసుకోవాలని.. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం రికార్డులు, అధికారిక వివరాల ఆధారంగా పరిశీలించాల్సి ఉన్నప్పటికీ.. ఈ అంశం విపక్షాల రాజకీయ ఉద్యమంలో ప్రధానంగా మారింది. ఈ క్రమంలోనే గత కొన్నిరోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారు.

ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశంలో ఓట్ల తొలగింపు ఆరోపణలపై సంయుక్త కార్యాచరణ గురించి చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దసరా తర్వాత దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని కూటమి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో నవంబర్ 1వ తేదీన భారీ సభ నిర్వహించే అవకాశాన్ని కూడా నేతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఇండియా కూటమి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

అయితే.. ఈ బహిరంగ సభ నిర్వహణ తేదీ, వేదిక, పాల్గొనే జాతీయ నాయకుల జాబితా, జనసమీకరణ లక్ష్యం వంటి అంశాలపై పార్టీ నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు, వాటికి సంబంధించిన అధికారిక వివరణలు, ప్రతిపక్షాల డిమాండ్లు ఈ సభలో ప్రధాన చర్చనీయాంశాలుగా మారే అవకాశం ఉంది.

క్రీడల్లో శిక్షణ ఇప్పించాలి

నగర పోలీస్ కమిషనర్ శ్వేత

పీపుల్స్‌డైరీ-హనుమకొండ : విద్యార్థి స్థాయి నుంచి పిల్లలకు క్రీడల్లో శిక్షణ ఇప్పించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శ్వేత కోరారు. ఈనెల 16, 17వ తేదీల్లో నిర్వహించనున్న మినీ సబ్ జూనియర్ బాలుర ఛాంపియన్షిప్ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి. సాంబశివరావు కోరుతూ.. సిపి శ్వేతకు వినతిపత్రం సమర్పించారు. ఈనెల 16, 17 వ తేదీల్లో ములుగు రోడ్డు లోని ఎల్బీ కళాశాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల నుంచి బాలుర జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని వివరించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. సాఫ్ట్ బాల్ క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తున్న అసోసియేషన్ సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ ఆసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

